
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 19 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 18.0

ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు



జిల్లాకేంద్రం నుంచి ధాన్యం ఎగుమతి చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. దొడ్డురకాల ధాన్యమంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే కొనుగోలు చేస్తుంటే, సన్నరకాల ధాన్యం కొనుగోళ్లలో మాత్రం మిల్లర్లు హవా కొనసాగించారు. ఇంకోవైపు ధాన్యం కొనుగోళ్లు ముగుస్తున్న సందర్భంలో కొందరు దళారులు ఇక్కడి సన్నధాన్యానికి ఉన్న డిమాండ్‌ని, బోనస్‌ని సొమ్ము చేసుకునేందుకు ఏపీలోని గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి దొడ్డిదారిన ధాన్యాన్ని తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు, అధికారయంత్రాంగం అప్రమత్తమవడంతోపాటు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించి తనిఖీలు ముమ్మరం చేశారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

» సన్నాల కొనుగోళ్లలో మిల్లర్లదే హవా » ఏపీ నుంచి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు

జిల్లాలో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు చేరాయి. ఈ సంవత్సరం అక్టోబరులో మొదలైన వరి కోతలు దశలవారీగా ఇప్పటి వరకు కొనసాగుతుండడంతో కొనుగోళ్లు సైతం కొనసాగుతూనే ఉన్నాయి. వరికోతలు దాదాపు చివరిదశగా చేరగా, ధాన్యం కాంటాలు ఈ నెలాఖరు వరకు కొనసాగే అవకాశం కన్పిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 2,28,416 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, అందులో దొడ్డురకాలు 1,90,980 మెట్రిక్‌టన్నులు, సన్నరకం ధాన్యం 37,435 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉంది. ఈ ధాన్యానికి సంబంధించి 42,609 మంది రైతులకు, మొత్తం రూ.529.92కోట్ల విలువైన ఖరీదులు జరిగాయి. ఇందులో రూ.496.21 కోట్ల మొత్తం రైతులకు అందజేయగా, బిల్లులు సబ్మిట్ చేసిన మిగిలిన మొత్తం కూడా వా రం రోజుల్లో చెల్లింపులు జరుగుతాయని అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రభు త్వ కొనుగోళ్లు గత సీజన్‌కంటే తక్కువగా నమోదయ్యాయని, గతేడాది ఇదే సమయానికి దాదాపు 3.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యంకొనుగోళ్లు జరిగాయని, ఈసారి మిల్లర్ల కొనుగోళ్లు ఎక్కువగా ఉండడంతో కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సన్నాల కొనుగోళ్లలో మిల్లర్లదే హవా

సంక్రాంతి నుంచి రేషన్ బియ్యంగా, హాస్టళ్లు, గురుకులాల్లో పిల్లలకు సన్నబియ్యంతో వండిన అన్నమే పెట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమేరకు సన్నధాన్యం ఉత్పత్తిని పెంచేందుకు ప్రోత్సాహకాన్ని రైతులకు ప్రకటించింది. సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అయితే వరి సాగు ఎక్కువగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాష్ట్రం...


ఏపీ నుంచి ధాన్యం రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సన్నధాన్యానికి తెలంగాణలో రూ.500 బోనస్ ఇస్తుండడంతో దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలోని గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి వాడపల్లి, నాగార్జునసాగర్, మట్టపల్లి, కోదాడ, మేళ్లచెరువు ప్రాంతాలమీదుగా రాత్రివేళల్లో ట్రాక్టర్లు, లారీల్లో ధాన్యం తెచ్చి ఇక్కడి రైతుల పేరున విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ సరిహద్దుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించడంతో జిల్లాల్లో సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు, సరైన రవాణా పత్రాలు లేకపోతే ధాన్యం వాహనాలను మిల్లులకు వచ్చేవాటిని సైతం వెనక్కిపంపిస్తున్నారు. వ్యాపారులు, మిల్లర్లు రవాణా పత్రాలతో ఏపీ నుంచే కాదు ఎక్కడి నుంచైనా ధాన్యం తెచ్చుకోవచ్చని, దానికి అభ్యంతరం లేదని, కానీ ఎలాంటి పత్రాల్లేకుండా ఇక్కడి రైతుల పేరున ధాన్యం తీసుకొస్తే మాత్రం సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- మిగతా 8వ పేజీలో..



పొరుగు రాష్ట్ర ధాన్యం కొనుగోలు చేయబోం



పొరుగురాష్ట్రం నుంచి ధాన్యం అక్రమంగా రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించాం. ఎట్టిపరిస్థితుల్లో ఇక్కడి రైతుల పేరుతో ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని కొనుగోలు చేయం. క్షేత్రస్థాయిలో ఎవరైనా అలాంటి ప్రయత్నాలు చేస్తే మాదృష్టికి తీసుకువస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో సాగువివరాలు, రైతుల వివరాలు క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే స్థానిక రైతులకు ఎంత ధాన్యం పండిందో అంతమేరకే ధాన్యం విక్రయాలకు వ్యవసాయ శాఖ అనుమతిస్తుంది. ఆ ధాన్యాన్నే కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు తప్ప దళారులు తెచ్చేధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదు.

- వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, నల్లగొండ

వార్డు ఆఫీసర్లు.. వచ్చేస్తున్నారు



» ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 180 మంది కేటాయింపు

» వార్డుల్లో సమస్యల పరిష్కారంతో పాటు పన్నుల వసూళ్ల బాధ్యత

» సమస్యలపై వార్డు ఆఫీసర్లను సంప్రదించాల్సిన ప్రజలు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు పాలనా పరమైన విధులను అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. రెవెన్యూ పనులకు సం బంధించి ఆర్‌ఐలు, డీటీలు విధులు నిర్వహిస్తున్నారు. మునిసిపాలిటీల్లో మాత్రం ప్రజలకు వా రి అవసరాల కోసం మునిసిపల్ కార్యాలయాల కు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. మునిసిపల్ కార్యాలయం నుంచే ప్రజలకు అవసరమై న సేవలు అందడంతోపాటు సమస్యల పరిష్కా రం లభిస్తుంది. కానీ ఇక నుంచి మునిసిపాలిటీల్లోని ప్రజలు మునిసిపల్ కార్యాలయాలకు వెళ్లకుండానే వారు నివసిస్తున్న వార్డునుంచే వారి పనులను చక్కబెట్టుకోవచ్చు. అంతేకాకుండా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కూడా వార్డు ఆఫీసర్ల ద్వారా పరిష్కరించుకునే అవకాశం లభించింది. ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ప్రజల కు పరిపాలనను చేరువ చేసేందుకు తాజాగా వార్డు ఆఫీసర్లను నియమించింది. మునిసిపల్..

మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 180 మంది వార్డు ఆఫీసర్లు

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలకు మొత్తం 180 మంది వార్డు ఆఫీసర్లను నియమించారు. నల్లగొండ జిల్లాలో ఎనిమిది మునిసిపాలిటీలుండగా 77మంది, సూర్యాపేట జిల్లాలో ఐదు మునిసిపాలిటీలుండగా 62 మంది, యాదాద్రి జిల్లాలో ఆరు మునిసిపాలిటీలకు 41మందిని కేటాయించారు. అయితే నల్లగొండ మునిసిపాలిటీకి 41 మంది, మిర్యాలగూడకు 22మంది, దేవరకొండకు నలుగురు, హాలియా, చిట్యాల, చండూరుకు ఒక్కొక్కరు, నకిరేకల్‌కు ఐదుగురు, నందికొండకు ఇద్దరిని కేటాయించారు. అదేవిధంగా సూర్యాపేట మునిసిపాలిటీకి 39 మం ది, కోదాడకు 12 మంది, హుజూర్‌నగర్‌కు 8 మంది, తిరుమలగిరికి ఇద్దరు, నేరేడుచర్లకు ఒక్కరిని కేటాయించారు. యాదాద్రి జిల్లాలో భువనగిరి మునిసిపాలిటీకి 23 మం ది, చౌటుప్పల్‌కు ఆరుగురు, యాదగిరిగుట్టకు ముగ్గురు, మోత్కూరుకు ముగ్గురు, ఆలేరుకు ముగ్గురు, భూదాన్‌పోచంపల్లికి ముగ్గురిని కేటాయించారు.

జిల్లా వ్యవసాయ అధికారితో నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 7288800023



నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో విత్తనాలు, ఎరువులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం 19వ తేదీన జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జేడీఏ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులు అడిగే ప్రశ్నలు, సందేహాలకు సమాధానం ఇస్తారు. 7288800023 నెంబర్‌కు ఫోన్ చేస్తే వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రశ్నలకు జేడీఏ సమాధానం ఇస్తారు. జిల్లాలోని రైతులు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ఫోన్‌ఇన్‌ను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ సీజన్‌కు సంబంధించి విలువైన సమాచారం తెలుసుకునేందుకు వీలు ఉంటుంది.

పేదలను దోచి పెద్దలకు పంచుతున్న మోదీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పేదలను దోచి కార్పొరేట్ పెద్దలకు పంచి పెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కాంట్రాక్టర్లకు, కార్పొరేటర్లకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పేదలను విస్మరిస్తున్నాయన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు అధికారంలో ఉండడం వల్ల మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తిరిగి ఢిల్లీలో రైతులు అందోళనలు చేస్తున్నారన్నారు. మణిపూర్‌లో అల్లరు జరిగి పరిస్థితులు ప్రమాదకరంగా మారినప్పటికీ, ప్రజల్లో శాంతి నెలకొల్పేందుకు ప్రధాని ఆ ప్రాంతాన్ని సందర్శించక పోవడం శోచనీయమన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, పిల్లుట్ల సైదులు, చనగాని సైదమ్మ, కందుకూరి రమేష్‌బాబు, కన్నెకంటి రామకృష్ణ, ఉన్నం వెంకటేశ్వర్లు, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకునేవరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మధుబాబు

నల్లగొండ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకునేవరకు పోరాటం ఆగదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమల్ల మధుబాబు స్పష్టం చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాలలను కించపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న ప్రకటనపై ఈ నెల 19న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు మాలలు ఎంతో కృషిచేశారని తెలిపారు. మందకృష్ణ మాదిగ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడి వర్గీకరణ చేస్తే ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో అన్నిమల్ల లింగస్వామి, అంగరాజు స్వర్ణలత, కూచుమల్ల లలిత, జ్యోత్స్న, విజయ, రొయ్య కిరణ్, ముడుసు బిక్షం, ముసుకు పృథ్వీ అద్దంకి వెంకన్న పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు లేని జిల్లాగా మార్చాలి



కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండను మాతా శిశు మరణాలు లేని జిల్లాగా మార్చాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత మాతృ మరణాలు, శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. మాతృ, శిశు మరణాలు జరిగితే అందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వాహించాలన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంతో ఏ తల్లీ బాధ పడకూడదన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు, ప్రసవానంతరం కూడా పూర్తిగా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ పర్యవేక్షణలో ఉండాలన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు, ఇమ్యునైజెషన్, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రిస్కిప్షన్ లేకుండా కొన్ని మెడికల్ షాపుల్లో మందులు, ఆస్పత్రుల్లో ఆబార్షన్ కిట్లు విక్రయిస్తున్న తమ దృష్టికి వచ్చిందన్నారు. వైద్యుల అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాణాలు కాపాడటమే వైద్యులు విధిగా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉండా లన్నారు. మాతాశిశు మరణాలు నివారించే విషయంలో ఇకపై ఏరియా ఆసుపత్రుల వారీగా, డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్, అబార్షన్ వంటి వాటి పట్ల పట్టణస్థాయి మొదలుకొని గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షణ్ణంగా పరిశీలిచాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి సూచించారు. మండలంలోని గుర్రపుతండా పరిధిలోని దర్గాతండాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పరిశీలించారు. ఇల్లు మొత్తం వచ్చేలా ఫొటోలో తీయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని వలస వెళ్లిన వారికి ఫోన్ లేదా ఇతరత్ర మార్గాల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

గుర్రంపోడు, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం పరిశీలించారు. సర్వే వివరాలు పంచాయతీ కార్యదర్శి స్వీటీ, ఎంపీఓ మంజులను అడిగి తెలుసుకున్నారు. జిన్నాయిచింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 177 మంది దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు 77 దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి అప్‌లోడ్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీవో పద్మ ఉన్నారు.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో బాలరాజురెడ్డి ఉన్నారు.

చింతపల్లి ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చింతపల్లి ఎంపీడీవో సుజాతకు కలెక్టర్ ఇలాత్రిపాఠి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని గానీరాంతండా, నసర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు బుధవారం క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రమావత్ శంకర్, కొర్ర సరిత తదితర దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాస్తుల్లో ఫొటోలతో వివరాలు పొందుపరచలేదు. ఆన్‌లైన్ యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా

● డీఎస్‌వో వెంకటేశ్వర్లు



నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

నూతన ఆవిష్కరణలకు వేదిక

నేడు, రేపు నల్లగొండలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రదర్శనలో 113 ప్రాజెక్టులు

నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని డాన్‌బోస్కో హైస్కూల్‌లో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ప్రారంభం కానుంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నల్లగొండలో 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలస్థాయిలో ఎంపికైన 113 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు పోటీ పడనున్నారు. సైన్స్ ప్రదర్శనతో పాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన కూడా నిర్వహించనున్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా, సైన్స్‌పై ఆసక్తిని పెంచేలా ప్రభుత్వం సైన్స్ ఎగ్జిబిషన్‌లను నిర్వహిస్తుంది. సైన్స్ టీచర్లు, గణితశాస్త్ర సహకారంతో విద్యార్థులు నూతన ఆలోచనలు పెంపొందించి ప్రజలకు అవసరమైన పరిశోధనలు తయారు చేసే విధంగా కృషి చేస్తుంది. ఇందుకోసం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్ర సాంకేతిక విషయాలపై ఆసక్తిని పెంపొందింపజేసి ప్రాజెక్టుల రూపకల్పన చేస్తున్నారు. విద్యార్థులకు వచ్చిన ఆలోచనలను తయారు చేసిన ప్రాజెక్టులను తోటి విద్యార్థులకు తెలియజేసే విధంగా ప్రదర్శనలో అవకాశం కల్పిస్తున్నారు.

ప్రధాన అంశాలు ఇలా.....

సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర అంశాలపై ఎగ్జిబిటర్లను ప్రదర్శించనున్నారు. ప్రధానంగా ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచార రంగం, వ్యవసాయం, సేంద్రియ పద్ధతులు, విపత్తుల నిర్వహ ణ, గణిత నమూనాలు, కాంపిటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే ఉప అంశాలపై నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారు.

ఎంపికైన ప్రాజెక్టుల తయారీకి నిధుల మంజూరు

జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించేందుకు మండలస్థాయి నుంచి 113 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల తయారీ కోసం ప్రభుత్వం ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున మంజూరు చేసింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ ప్రదర్శనలు జరగనున్నాయి. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు జూనియర్, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. ఒక్కొక్క ప్రాజెక్టు వెంట ఒక విద్యార్థి, పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయుడిని అనుమతి ఇస్తారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా 20వ తేదీన సాయంత్రం మిల్లెట్స్ ఫర్ సస్టైయినబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్‌పై సెమినార్ నిర్వహించనున్నారు.

పేదల కోసం సమరశీల పోరాటాలు : వెంకట్‌రెడ్డి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదల ప్రజల కోసం సమర శీల పోరాటాలు చేస్తున్నామని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30న నిర్వహించే సీపీఐ వసంతోత్సవ వేడుకల మహాసభల పోస్టర్‌ని, బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో అవిష్కరించి మాట్లాడారు. అనేక త్యాగాలు, పోరాటాలతో నిర్మితమైనది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటైందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి దేశంలో కష్టజీవుల పక్షాన కార్మిక, రైతాంగ, మహిళా, విద్యార్థి, యువజన హక్కుల సాధనకోసం పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థిక అసమానతలులేని సమాజం నిర్మాణ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డిసెంబరు 26 నాటికి 100వ ఏడాదిలోకి అడుగుపెడుతుందన్నారు. వేడుకలను పురస్కరించుకొని డిసెంబరు 30న జిల్లాకేంద్రంలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభకు 40వేల నుంచి 50వేల మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఖిల్లా అన్నారు. సీపీఐ బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుంచి వచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జమిలి ఎన్నిక మోదీ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బంటు వెంకటేశ్వర్లు, బొల్గురి నర్సింహ, వెంకటేశ్వర్లు, గాదెపాక రమేష్, కేఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లంకిలో చేనేత కార్మికుడి బలవన్మరణం

రామన్నపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మల్లయ్య, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వనం బాలరాజు (38) మగ్గం నేస్తూ జీవనం సాగిస్తుండగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య రాజేశ్వరి మగ్గం పనులకు చేయూతగా ఉంటోంది. ఆరు నెలలుగా వృత్తి పనులు తగ్గటంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. ఇదే సమయంలో మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తగాదాలు తలెత్తాయి. దీంతో భార్య కొద్ది రోజుల క్రితం వెల్లంకి గ్రామంలోనే ఉన్న పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మంగళవారం తండ్రిని చూసేందుకు ఇంటికి వచ్చిన పెద్ద కుమార్తె మధుబాల(10)కు తండ్రి దూలానికి వేలాడుతూ కనిపించాడు. దీంతో ఆమె ఇచ్చిన సమాచారంతో బంధువులు వచ్చి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలరాజు భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

36 దూడల పట్టివేత

భువనగిరి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న 36 ఆవు, దూడలను బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం అరమండి సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్ బహదూర్‌పురలో వధించేందుకు మూడు వాహనాల్లో ఆవు, దూడలను తరలిస్తున్నట్లు డయల్ 100కు వచ్చిన సమాచారం ఆధారంగా అప్రమత్తమైన పోలీసులు కాపుకాసి బైపాస్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. మూడు వాహనాలలో అమానుషంగా కట్టివేసిన 33 ఆడదూడలు, మూడు మగదూడలను స్వాధీనం చేసుకొని హైదరాబాద్ జియాగూడలోని గోశాలకు తరలించారు.

చలి కాలం పశువులు పైలం

» వ్యాధి నిరోధకశక్తి తగ్గి వ్యాధులు సోకే ప్రమాదం » రైతులకు మోటకొండూరు పశువైద్యాధికారి శ్రీకాంత్ సూచనలు



చలి కాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాడి పశువుల ఆరోగ్యం ప్రభావం చూపుతుంది. పశువుల్లో జీర్ణశక్తి మందగించి ఆహారం తీసుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. గొంతు వాపు వ్యాధి సోకిన పశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతుంటాయి. చలి కాలంలో పాడి పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకునే అంశాలపై యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు పశువైద్యాధికారి పూతోట శ్రీకాంత్ రైతులకు చేసిన సూచనలు ఆయన మాటల్లోనే...

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి రూరల్)

మంచుతో కూడిన వాతావరణం కారణంగా పాడి పశువులు వ్యాధుల బారిన పడుతాయి. చలి గాలులకు ఒత్తిడికి గురై.. వ్యాధి నిరోధక శక్తి కోల్పోతాయి. ఈ నేపథ్యంలో పశువుల పాకను శుభ్రంగా ఉంచుకోవాలి. గాలి, వెలుతురు వచ్చే విధంగా, మురుగు బయటకు వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలి. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గడం వల్ల పశువుల్లో జీర్ణశక్తి మందగించి ఆహారం సక్రమంగా తీసుకోవు, పోషకాలు తగ్గిపోతాయి. గొంతు వాపు వ్యాధి సోకిన పశువులు కష్టంగా శ్వాస తీసుకుంటాయన్నారు. దోమలు, తొండీగలు పశువుల రక్తం తాగడం వల్ల రక్తహీనత ఏర్పడి నిరసించి పాల ఉత్పత్తి తగ్గుతుంది. దోమల కారణంగా ఫైలేరియా, తొండీగల వల్ల కుందేటి వెర్రి వ్యాధి సోకుతాయి. చలికాలంలో పశు పోషణలో తగిన జాగ్రత్తలు పాటించాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు ..

ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల నియోకాకై సూక్ష్మ జీవులు పశువుల ఊపిరితిత్తులపై దాడి చేసి శ్వాస కోశ వ్యాధులకు గురి చేస్తాయి. ఊపిరితిత్తుల్లో వాపు ఏర్పడి శ్వాస ప్రక్రియలో సమస్యలు తలెత్తుతాయి. ఈ సమయంలో వ్యాధి నిరోధక మందులను దాణాలో కలిపి అందించాలి. పశువులకు అందించే ఆహారంలో మార్పు చేయాల్సి ఉంది. సాధారణంగా ఇచ్చే ఆహారానికి భిన్నంగా శీతాకాలంలో సమీకృత ఆహారంలో పాస్ఫేట్ అధికంగా ఉండే గోధుమ తవుడుతో తయారైన దాణా తినిపించాలి. చలిని తట్టుకునేలా పాకాలో గోనే పట్టలు, పాత దుప్పట్లు కప్పి ఉంచాలి. అవసరమనుకుంటే నేలపై ఎండుగడ్డి పరచాలి. ఆరుబయట చెట్ల కింద పశువులను కట్టే యజమానులు ఎండ తగిలేలా కొమ్మలు కత్తిరించాలి. ఉదయం మంచు తగ్గిన తర్వాత పశువులను బయటకు వదలాలి. రోజు వారి అందించే దాణా కంటే 20శాతం ఎక్కువగా పెట్టాలి. దాణా రాత్రి వేళ పెట్ట కూడదు. పచ్చగడ్డే కాకుండా ఎండుగడ్డి అందుబాటులో ఉండడం వల్ల అవసరమైన పీచు పదార్థం లభిస్తోంది. తద్వారా పశువుల శరీర ఉష్ణోగ్రతలు కాపాడుకుంటాయి. గొంతు వాపు, జబ్బవాపు, గాలికుంటు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. ముందుగానే నివారణ చర్యగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువుల జీర్ణప్రక్రియ మందగించకుండా చర్యలు తీసుకోవాలి. పోషక పదార్థాలను మేతగా ఇవ్వాలి. పశువులు గర్భంతో ఉంటే పిండం పెరుగుదలకు కావాల్సిన అధిక పోషకాహారం అందించాలి.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలం దృష్ట్యా పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల పశువుల్లో జీర్ణశక్తి మందగిస్తుంది. ఆహారం తీసుకోకపోవడం వల్ల పోషకాలు తగ్గి గొంతువాపు వ్యాధి సోకి అనారోగ్యానికి గురవుతాయి. పశువుల పాకను శుభ్రంగా ఉంచుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే పశువులు అనారోగ్యానికి గురికావు.

- శ్రీకాంత్, మోటకొండూరు మండల పశు వైద్యాధికారి

మూగజీవాలకు బాసటగా..

కోదాడరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని పశు వైద్యశాలలో పశు ఔషధ బ్యాంక్ ఏర్పాటైంది. కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య దీనిని పర్యవేక్షిస్తున్నారు. దాతల సహకారంతో రైతులకు అవరమైన మందులు అందజేస్తున్నారు. పాలు, పెరుగు, మజ్జిగ, మాంసం, స్వీట్లు, చాక్‌లెట్స్, గుడ్లు, ఏదో ఒక రూపంలో పశు ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్న నేపథ్యంలో పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాలతో ఉత్పత్తి అయ్యే పదార్థాలు నాణ్యంగా ఉంటాయనే ఉద్దేశంతో. ఆర్థిక స్థోమత లేదని సన్న, చిన్నకారు రైతులు పశువులకు మందులు అందిస్తున్నారు. పశువులకు జబ్బు చేసినప్పుడు చిన్న, సన్నకారు రైతులు పశుపోషకులకు సకాలంలో వైద్యం అందించలేకపోతున్న నేపథ్యంలో ఈ పశు ఔషధ బ్యాంకు రైతులకు ఉపయోగపడుతుంది.

దాతల సహకారంతో..

ప్రాంతీయ పశు వైద్యశాలకు ప్రభుత్వం రూ.1.08లక్షల కేటాయిస్తుంది. వీటిని ఔషదాలు, మందులు, ఆపరేషన్లు చేసేందుకు కేటాయిస్తారు. కోదాడ మునిసిపాలిటీ పరిధిలో 200 ఆవులు, 5,083 గేదెలు, 4302 గొర్రెలు, 687 మేకలు, 1,01,465కోళ్లు, 1,11,737 పుంజులు ఉన్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే 20వేలకు పైగా పశువులకు వైద్యం చేస్తారు. అన్ని పశువైద్యశాల ద్వారా ఔషదాలు ఇవ్వడం సాధ్యం కాకపోవడంతో పాటు ఔషదాలు కొనుగోలు చేయలేని పరిస్థితి. దీంతో పశువులకు సరైన సమయంలో వైద్యం అందడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని పశు ఉత్పత్తులు పెంపొందించేందుకు ఏడీఏ డాక్టర్ పెంటయ్య నెల రోజుల క్రితం కోదాడలోని పశు వైద్యశాలలో ప్రత్యేకంగా పశు ఔషధ బ్యాంకు ఏర్పాటు చేశారు. పశువైద్యశాల ఆవరణలో పేర్కొన్న ఔషధాల జాబితాలోలేని పశు ఔషధాలను దాతలు, ఎస్ఆర్ఐల ద్వారా అందిస్తున్నారు. దాతలు సహకరించి పశు ఆరోగ్యంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



పశు ఔషధ బ్యాంక్‌తో ఉపయోగాలు

కోదాడ పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే పశువులకు ప్రాంతీయ పశువైద్యశాలలో వైద్యం చేయించే వెసులుబాటు ఉంటుంది. సరైన సమయంలో పశువు ఔషధ బ్యాంకుతో ఏర్పాటుతో పశుపోషలకు చేయూతనిస్తూ, వారికి ఆర్థిక భారం తొలగించేందుకు ఉపయోగపడుతుంది. అవసరమైన మందులు పంపిణీ చేస్తారు. ప్రత్యేక రికార్డు నిర్వహిస్తూ తేదీల వారీగా ఎవరు ఎప్పుడు ఏ ఔషదం అందించారు, ఎప్పుడు వాడారనే వివరాలు ప్రాంతీయ పశువైద్యశాఖ బోర్డుపై ఉంచుతారు.



హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

మిర్యాలగూడ లీగల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ భూమిలో అక్రమంగా మట్టి బాట వేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు, జరిమానా విధించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం పరిధిలోని జెత్యాతండా గ్రామానికి చెందిన వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్ఎంపీ సైదులుపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి. వేణు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మిర్యాలగూడ మండలం జెత్యాతండాకు చెందిన వీరమళ్ల లక్ష్మమ్మకు పాలివాళ్లైన అదే గ్రామానికి చెందిన వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్ఎంపీ సైదులు, వీరమళ్ల సైదులు అలియాస్ భద్రి సైదులు, వీరమళ్ల సైదులు అలియాస్ బుర్రి సైదులు, వీరమళ్ల పెదలక్ష్మయ్య, వీరమళ్ల వెంకన్న, పక్క పొలం వారైన మాలోతు కోటయ్యలతో బాట విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. 2018 ఆగస్టు 18న లక్ష్మమ్మ భూమి మధ్యలో నుంచి ఉన్న మట్టి బాటను మరికొంత వెడల్పుగా చేసేందుకు సదరు వ్యక్తులు ట్రాక్టర్‌లు, జేసీబీలతో పొలం వద్దకు వచ్చి బాటకు ఇరువైపులా మట్టి పోస్తున్నారు. విషయం తెలుసుకున్న లక్ష్మమ్మ పొలం వద్దకు వచ్చి బాటకు మట్టి పోస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంది. ట్రాక్టర్ నడుపుతున్న వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్ఎంపీ సైదులు లక్ష్మమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టగా ఆమె కిందపడిపోగా, ట్రాక్టర్ ఆమెపై నుంచి వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకొని అప్పుడే అక్కడికి వచ్చిన లక్ష్మమ్మ మనుమడు వెంకటకృష్ణ గాయాలతో ఉన్న ఆమెను మిర్యాలగూడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. వీరమళ్ల వెంకటకృష్ణ ఫిర్యాదు మేరకు అప్పటి మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ డి.సైదాబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, సీఐ రమేష్‌బాబు దర్యాప్తు పూర్తిచేసి ఆరుగురిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్షులను విచారించిన న్యాయస్థానం మొదటి నిందితుడైన వీరమళ్ల సైదులు అలియాస్ ఆర్ఎంపీ సైదులు లక్ష్మమ్మను చంపాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌తో ఆమెను తొక్కించి ఆమె మృతికి కారకుడయ్యాడని నిర్ధారిస్తూ అతనికి జీవిత ఖైదు, జరిమానా విధించింది. జరిమానా విధించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. కేసులో మిగిలిన ఐదుగురు నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో వీరిని నిర్దోషులుగా ప్రకటించింది. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పీపీ వెంకటరమణరెడ్డి కేసు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ అధికారి చెరుపల్లి సైదులు, కోర్టు కానిస్టేబుల్ కిషన్ సహకరించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

త్రిపురారం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజ్ వైరు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని అల్వాలపాడు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... త్రిపురారం మండలంలోని నీలాయిగూడెం గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు(24) పది సంవత్సరాల క్రితం దామరచర్లకు బతుకు దెరువు కోసం తల్లిదండ్రులతో కలిసి వలస వెళ్లి అక్కడ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. త్రిపురారం మండలంలోని అల్వాలపాడులో ఉన్న అతని మేన మామ బొల్లిగొర్ల సైదులు ఇంటికి వ్యవసాయ పనుల నిమిత్తం నాగరాజు, తల్లిదండ్రులు సాంబమ్మ, సైదయ్య కలిసి 15రోజుల క్రితం వెళ్లారు. మేనమామ పొలం వద్ద మోటారు నడవకపోవడంతో పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి పరిశీలించాడు. ఫీజ్ వైరు తెగి ఉండడంతో దానిని సరి చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. అదే దిమ్మె మీద ఉన్న మరో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ నిలిపి వేయలేదు. ఫీజ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైన నాగరాజు దిమ్మెపై నుంచి కింద పడ్డాడు. తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజు అవివాహితుడు. తల్లి సాంబమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొని..

భువనగిరి టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిలిపిఉన్న ట్రాక్టర్‌ను ఓ కారు ఢీ కొట్టింది. అదుపు తప్పిన కారును వెనుకాలే వచ్చిన మరోకారు ఢీ కొట్టింది. దీంతో రెండు కార్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డుపై బుధవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం పహిల్వాన్‌పురానికి చెందిన పల్లెల సురేష్ ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవడంతో బైపాస్ రోడ్డుపై వరంగల్ వైపు నిలిపివేశాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు నిలిపిఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఆ వెనకాలే వేగంగా వచ్చిన మరోకారు డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.




ధ్వంసమైన కారు.. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

వార్డు ఆఫీసర్లు వచ్చేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

సేవలను మెరుగైన పర్యవేక్షణ, సమర్థవంతంగా అమలు చేయడంలో వార్డు ఆఫీసర్ల నియామకం సహాయపడుతుందని ప్రభుత్వం భావించింది. అందుకోసం ఒక్కో వార్డుకు ఒక ఆఫీసర్‌ను కేటాయించనున్నారు. నూతనంగా నియమించిన ఆఫీసర్లు వారికి కేటాయించిన వార్డుల్లో ప్రతీరోజు పర్యటించి వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుంది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీలకు 180మందిని ప్రభుత్వం కేటాయించింది.

పన్నుల వసూళ్ల బాధ్యత

నూతనంగా మునిసిపాలిటీలకు కేటాయించిన వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన వార్డుల్లో అనేక పనులు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వార్డుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి వారితో ఇంటి, నల్లా పన్నులు సకాలంలో వసూలు చేయించాల్సి ఉంటుంది. అదేవిధంగా వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాల, వీధిలైట్ల నిర్వహణ, వార్డుల్లో నాటిన మొక్కల సంరక్షణ, కొత్తగా మొక్కలు నాటడం, తడిచెత్త, పొడి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్సుల జారీలాంటి వాటిపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది. దీంతోపాటు వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మునిసిపల్ అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరింపచేయడం, అభివృద్ధి పనుల పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వార్డుల్లో ఎవరైనా ఏదైనా కారణంతో మరణిస్తే ఆ సమాచారాన్ని మునిసిపల్ అధికారులకు తెలియజేయడంలాంటి విధులు నిర్వర్తించాల్సి ఉంది. వార్డుల్లో ప్రభుత్వం అందించే వివిధ రకాల పింఛన్ల అందజేతతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేసే ప్రతీ పథకాన్ని లబ్ధిదారులకు అందుతున్నాయా? లేవా? అనే విషయాలపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వార్డుల్లో అంటువ్యాధుల నివారణ, నియంత్రణకోసం చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

వార్డు ఆఫీసర్లను సంప్రదించాల్సిన ప్రజలు

మునిసిపాలిటీల్లోని ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం ఇక నుంచి మునిసిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం నియామకం చేసిన వార్డు ఆఫీసర్ల దృష్టికి సమస్యలను తీసుకెళ్తే ఆ సమస్యల పరిష్కారం కోసం వార్డు ఆఫీసర్లు పని చేయనున్నారు. అంతేకాకుండా మునిసిపాలిటీల్లో ప్రజలకు వ్యక్తిగత పనులు ఉంటే కూడా వార్డు ఆఫీసర్ల ద్వారా సంబంధిత పనులను పూర్తి చేయించుకునే అవకాశం నెలకొంది.

ప్రభుత్వం వార్డు ఆఫీసర్లను కేటాయించింది



ప్రభుత్వం ఇటీవల వార్డు ఆఫీసర్లను కేటాయించింది. సూర్యాపేటకు 39మందిని కేటాయించారు. వారికి త్వరలో వార్డులను కేటాయించి ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు అప్పగిస్తాం. వార్డు ఆఫీసర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతోపాటు పన్నుల వసూళ్ల బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. కేటాయించిన వార్డులో అన్ని రకాల మునిసిపల్ పాలనాపరమైన సేవలను ప్రజలకు అందించాల్సి ఉంటుంది.

● శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట.

హరీష్‌రావు వ్యాఖ్యలు హాస్యాస్పదం

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వ విప్ అయిలయ్య మాట్లాడారు. శాసనసభ ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకుంటే ఇక్కడ మాత్రం హరీష్‌రావు తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేసిన మంత్రి వెంకట్‌రెడ్డిపై అర్థరహిత విమర్శించడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు తన బాధ్యతను మరిచి, ఫామ్‌హౌస్‌లో పడుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాగిన మైకంలో హెలికాప్టర్ నుంచి దిగిన అనంతరం కిందపడిన విషయం అందరికీ తెలిసిందని తెలిపారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా



హాలియా చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న డీసీఎస్‌వో

● డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు

హాలియా, నాగార్జునసాగర్ డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి సన్నధాన్యం రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు నల్లగొండ డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. నాగార్జునసాగర్ ఫైలాన్‌కాలనీ కొత్త వంతెన వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును, అనుముల మండలం హాలియా, కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలు పూర్తియ్యే వరకు ఇతర రాష్ట్రాల నుంచి సన్నధాన్యం రాకుండా సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ చర్యలు చేపట్టామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ధాన్యం వాహనాల్లో వచ్చే రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, ఐడీ ప్రూఫ్స్ పరిశీలించి తెలంగాణకు చెందిన ధాన్యం వాహనాలను మాత్రమే అనువ ుతించాలన్నారు. చెక్ పోస్టు వద్ద పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. నాగార్జునసాగర్ చెక్ పోస్టులో విధుల్లో ఉండాల్సిన ఏఈవో దేవా ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ట్రేడర్లు ఎవరైనా సన్నధాన్యాన్ని తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో పోస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు.

1,91,858 టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పటి వరకు 1,91,858 టన్నుల దొడ్డురకం ధాన్యాన్ని 34,879 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, ఆ రైతులకు రూ.433 కోట్లు చెల్లించినట్లు డీఎస్‌వో తెలిపారు. 40,150 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని 8,450 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని, అందులో సన్నధాన్యం కొనుగోలు చేసిన రైతులకు రూ.14.50 కోట్లు, బోనస్ రూపంలో క్వింటాకు రూ.500 చెల్లించినట్లు తెలిపారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో వేగవంతంగా కొనుగోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిఘా పటిష్టం : అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కోదాడ రూరల్, దామరచర్ల డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టు దాటి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణ రాష్ట్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకుండా నిఘా పటిష్టం చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ సూచించారు. నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా సరఫరాల శాఖ మేనేజర్ హరీష్ ఉన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని అంతరాష్ట్ర సరిహద్దుల్లో అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన 22 ధాన్యం లారీలను మంగళవారం రాత్రి అధికారులు వెనక్కి పంపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద గల చెక్‌పోస్టు వద్ద ఆంధ్రా నుంచి తెలంగాణలోకి వచ్చేందుకు ప్రయత్నించిన 12ధాన్యం లారీలు, నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద 10 ధాన్యం వాహనాలు అధికారులు వెనక్కి పంపారు.



వాడపల్లి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

భక్తుల రద్దీ.. బ్యాటరీ వాహనాలకు ఇబ్బంది

● భక్తులను తూర్పు రాజగోపురానికి బ్యాటరీ వాహనాల్లో తరలించేందుకు ఆటంకం ● ప్రత్యేక క్యూలైన్ ఉన్నా అదే దారిలో వెళ్తున్న భక్తులు, వాహనాలు



బ్యాటరీ వాహనంలో భక్తులను తరలిస్తున్న సురక్ష సిబ్బంది(ఫైల్)

భువనగిరి అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. వివిధ మార్గాల ద్వారా ఇక్కడకు భక్తులు తరలి వస్తుండడంతో ఆ ప్రాంతం కిక్కిరిస్తోంది. బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను తూర్పు రాజగోపురానికి తీసుకెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో బ్యాటరీ వాహనాలు అదుపు తప్పే ప్రమాదముందని భక్తులు వాపోతున్నారు. ప్రధానాలయంలోని స్వయం భూవులను దర్శించుకునేందుకు ముందుగా కొండపైన బస్టాండ్ చేరుకున్న భక్తులు అక్కడి నుంచి ధర్మదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లి క్యూ కాంప్లెక్స్ గుండా గోల్డెన్ లైన్ నుంచి ప్రధానాలయం చేరుకుంటారు. ప్రత్యేక దర్శనం చేసుకునే భక్తులు రూ.150 కౌంటర్ వద్ద ప్రత్యేక టికెట్ పొంది అక్కడి నుంచే తూర్పు రాజగోపురం గుండా ఆలయంలోకి చేరుకు ంటున్నారు. వీఐపీ పార్కింగ్ ఎదురుగా బుకింగ్ కౌంటర్ కింది భాగంలో వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా షెడ్డు అందుబాటులోకి తెచ్చి బ్యాటరీ వాహనాల ద్వారా వారిని కొండపైకి చేర్చుతున్నారు. ఇక్కడి నుంచి తూర్పు రాజగోపురం తరలించేందుకు వాహనాలకు ఆటంకం ఏర్పడుతోంది. రద్దీ రోజుల్లో పరిమితికి మించి తరలిస్తుండగా ఒక్కోసారి వాహనాలు అదుపు తప్పే ప్రమాదముంది. ఈ దారి వెంట నడిచే భక్తులు రోడ్డుపై వాహనాలకు అడ్డుగా వస్తుంటారు. ఘాట్ రోడ్డు అయినందున తరుచూ బ్రేకులు వేయాల్సి వస్తోంది. భక్తులు వెళ్లేందుకు ప్రత్యేకంగా దారి ఉన్నా వాహనాలు, భక్తులు ఒకే దారిలో వెళ్తుండడంతో బ్యాటరీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనిని అధిమించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్డు కింద నుంచే భక్తులు వెళ్లేలా సిబ్బందిని నియమించి చర్యలు చేపట్టాల్సి ఉంది. గతంలో బాలాలయం ఉన్న ఖాళీ ప్రదేశానికి ఫెన్సింగ్ వేసిన విధంగానే ఈ క్యూలైన్‌కు కూడా ఏర్పాటు చేసి అందులో నుంచే వెళ్తే బ్యాటరీ వాహనాలకు ఆటకం తొలగనుంది.

ప్రత్యేక క్యూలైన్ ద్వారా భక్తులు వెళ్లేందుకు చర్యలు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా భక్తులను పంపేందుకు ఎస్పీఎఫ్ సిబ్బందిని వినియోగిస్తాం. ఘాట్ రోడ్డులో భక్తులు అడ్డుగా రావడంతో బ్యాటరీ వాహనాలకు ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. ఇబ్బందులు తొలగించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటాం. రూ.150ల క్యూలైన్ ద్వారానే భక్తులు తూర్పు రాజగోపురం చేరుకునేలా చూస్తాం. ఒక వాహనం మరమ్మతుల్లో ఉంది. నాలుగు బ్యాటరీ వాహనాల ద్వారా భక్తులను తూర్పు రాజగోపురం చేరవేస్తున్నాం.

● ఏ. భాస్కర్‌రావు, ఆలయ ఈవో

దొంగలు బాబోయ్..

- కొండమల్లేపల్లిలో వరుస చోరీలు
- భయాందోళనలో ప్రజలు

కొండమల్లేపల్లి పట్టణంలో వరుస దొంగతనాలు బెంబేలెత్తిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో దొంగలు హల్‌చల్ చేస్తుండగా స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, కొండమల్లేపల్లి)


చోరీకి గురైన వైన్స్‌లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లిలో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంటి బయట ఆపిన ద్విచక్ర వాహనాలు తెల్లారే సరికే మాయం అవుతున్నాయి. అలాగే ప్రయాణంతో అలిసి పోయిన పెద్ద వాహనాలు ఊరుబయట ఆపితే డీజిల్ చోరీకి గురవుతున్నాయి. ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సెంట్రింగ్ సామగ్రి సైతం అపహరణకు గురవుతున్నాయి. తాజాగా సోమ వారం తెల్లవారుజామున కొండమల్లేపల్లిలోని వైన్స్ దుకాణంలో రూ.12వేల నగదుతో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లు అపహరణకు గురైంది. ఇప్పటికి జరిగిన చోరీకి సంబంధించి నష్టం కొన్ని లక్షల్లో ఉండొచ్చని పలువురు అంచనా వేస్తున్నారు.

చోరీ ఘటనలు

ఈ నెల 13వ తేదీన హైదరాబాద్ రోడ్డులో నివాసముంటున్న రమావత్ లక్ష్మణ్ తన ఇంటి ఎదుట బైక్‌ను నిలిపి ఉంచగా తెల్లారే సరికే చోరీకి గురైంది. రెండు నెలల క్రితం నల్లగొండ రోడ్డులో తన ఇంటి ముందు నిలిపి ఉంచిన డీసీఎం నుంచి 150 లీటర్ల డీజిల్ చోరీకి గురికి కాగా అదే రోజున మరో ఇద్దరికి చెందిన డీసీఎంల నుంచి డీజిల్ దొంగలించారు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించిన రూ.2లక్షల విలువైన 200 సెంట్రింగ్ సామగ్రి ఎత్తుకెళ్లారు. అలాగే నల్లగొండ రోడ్డులో ఓ వ్యక్తి ఇంటి నిర్మిస్తుండగా రూ.1.50లక్షల విలువైన 90 పిల్లర్స్ బాక్స్‌లు, తహ సీల్దార్ కార్యాలయం ఎదురుగా రూ.80 వేల విలువైన స్లాబ్ సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ అయ్యాయి. హైదరాబాద్ రోడ్డులోని బైపాస్ వద్ద ఉన్న శ్రీ లక్ష్మి వైన్స్‌లో అర్ధరాత్రి సమయంలో రూ.12వేల నగదుతో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లు చోరీకి గురయ్యాయి.

చోద్యం చూస్తున్న పోలీస్‌శాఖ

చోరీ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో పోలీసుల పెట్రోలింగ్ లేకపోవడం, వరుస చోరీల నేపథ్యంలో తనిఖీలు చేపట్టాల్సిన పోలీసు శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కెమెరాలున్నా..

కొండమల్లేపల్లిలో దాతల సహకారంతో పలు ప్రాంతాల్లో సుమారు 33 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయినా చోరీలు మాత్రం తగ్గడం లేదు. పోలీసులు చోరీ ఘటనలు బయటికి పొక్కనివ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. బాధితులు చెప్పే వరకు వెలుగులోకి రావడం లేదు. దీంతో పోలీసుల తీరుపై ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరుస చోరీలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన పోలీసుశాఖ అసలు విషయాన్ని బయటికి తెలియజేయనీయకుండా చేస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సెంట్రింగ్ సామగ్రి చోరీకి గురైంది



కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌కు దెగ్గరలో ఓ ఇంటి నిర్మాణం చేపడుతున్నాం. ఇందుకు సెంట్రింగ్ సామగ్రి వాడుతున్నాం. నూతన ఇంటి నిర్మాణం జరుగుతున్న చోట ఉంచిన సుమారు రూ.2 లక్షల విలువైన సెంట్రింగ్ బాక్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు.నాకు జీవనాధారమైన సెంట్రింగ్ సామగ్రి పోవడంతో ఎటు పాలుపోవడం లేదు. ఏ పని చేసుకోలేక పోతున్నా.. ఈ చోరీ గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాన

- జక్కల కృష్ణయ్య, కొండమల్లేపల్లి

నా బైక్ పోయింది



ఈనెల 13న ఇంటి ముందు నిలిపి ఉంచిన నా బైక్ ఉదయం కల్లా కనిపించకుండా పోయింది. ఎంత గాలించినా బైక్ ఆచూకీ దొరకలేదు. పోలీసులకు కంప్లైంట్ చేశాను. ఇంటి ముందు నిలిపి ఉంచి సొంత బైక్‌లకు కూడా కొండమల్లేపల్లిలో భద్రత లేకుండా పోయింది.

- రమావత్ లక్ష్మణ్, కొండమల్లేపల్లి

నిఘా పెంచాం

చోరీ ఘటనలకు సంబంధించి నిఘా పెంచాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచుతాం. సెంట్రింగ్ చోరీ ఘటనపై సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నాం. వరుస చోరీ ఘటనలను త్వరలోనే చేధిస్తాం. ప్రజలు సహకరించాలి.

-ముత్యాల రామ్మూర్తి, ఎస్ఐ, కొండమల్లేపల్లి

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	578.80
టీఎంసీలు	279.5452
ఎడమకాల్వకు నీటి విడుదల	8193
కుడికాల్వకు	8067
విద్యుత్ కేంద్రం ద్వారా	29,820
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300
ఇన్‌ఫ్లో	48,780
అవుట్‌ఫ్లో	35,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.20అడుగులు
టీఎంసీలు	4.25
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	58.32 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	92.80 క్యూసెక్కులు

నాడు.. పాటలతో చైతన్యం నేడు.. కూలీగా జీవనం



నిడమనూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆయన ఓ ప్రజాగాయకుడు, కవి. కాలికి గజ్జె కట్టి సామాజిక అంశాలపై తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యవంతులను చేశాడు. మూఢ నమ్మకాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా, గుడుంబా వలన పచ్చని సంసారాల్లో కలిగే అనర్థాల గురించి పల్లె పల్లె తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ మెరుగైన సమాజం కోసం ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొని పాటలతో ప్రజలను ఉత్తేజితులను చేశారు. ఎన్ని పాటలు పాడినా, ఎన్ని ప్రదర్శనలు చేసినా బతుకుదెరువు భారం కావడంతో పొట్టకూటి కోసం కూలీగా మారాల్సి వచ్చింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కంచి శ్రీనివాస్ గతంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసేవాడు. ఆయనకు పాటలంటే ప్రాణం. దీంతో అందరూ ఆయన్ను కంచి శ్రీనివాస్ బదులుగా గాయకుడు శ్రీనివాస్ అనే పిలుస్తారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే సమాజంలో మంచి కోసం, ప్రజలను చైతన్యం చేయడానికి తన గాత్రంతో అనేక కళా ప్రదర్శనలు ఇచ్చా డు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఊరూ రా తిరిగి తన పాటలతో రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రజలకు వివరించాడు. తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ)లో క్రియాశీలకంగా పని చేశాడు. నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా కోశాధికారిగా కూడా వ్యవహరించాడు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కవులు, కళాకారులు, ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని విశ్వసించాడు. గతంలో మాదిరిగా పని చేద్దామంటే ప్రస్తుతం తెలుగు మీడియం ప్రైవేట్ పాఠశాలలు కూడా అరుదుగా ఉన్నాయి. దీంతో బతుకుదెరువు భారం కావడంతో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించడానికి వ్యవసాయ కూలీగా మారాడు. పొలాల్లో కూలీ పనులు చేయడం, హమాలీగా ధాన్యం బస్తాలు మోస్తూ దినసరి కూలీగా రూ.500 సంపాదించుకుంటూ ఎలాగోలా జీవనాన్ని నెట్టుకొస్తున్నాడు.

కుటుంబపోషణ కోసమే కూలీగా..

పాటలు పాడటం అంటే నాకు ఎంతో ఇష్టం. నా ఆటపాటలతో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాను. తెలంగాణ ఉద్యమంలోనూ కీలకంగా పని చేశా. మమ్ములను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. కుటుంబ పోషణభారంగా మారింది. దీంతో పొట్టకూటి కోసం కూలీ పనులు చేయక తప్పడం లేదు. కవులు, కళాకారులు, ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- శ్రీనివాస్, ముప్పారం, గాయకుడు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


ముఖ మండపంలో అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళ భక్తులు


పూజలు చేస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహచార్యులు

భువనగిరిఅర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 17,68,443 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. మూడో రోజు ధనుర్మాసోత్సవాలు ఆలయ పూజారులు చేపట్టారు. ఆలయ ముఖ మండపంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్ది వేదికపై అధిష్ఠింపజేశారు. వేద మంత్రా లు, మంగళవాయిద్యాల నడుమ అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొని హారతి నివేదించగా పొంగలి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.


ప్రత్యేక అలంకరణలో మహాగణపతి

మహాగణపతికి సంకటచతుర్ది పూజలు

కనగల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బుధవారం మార్గశిర బహుళపక్షం సంకట చతుర్థిని పురస్కరించుకుని శ్రీమహాగణపతికి సహస్రనామార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి మొదటగా మహాగణపతిని దర్శించుకున్నారు. అనంతరం గర్భగుడిలోని ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని కుంకుమార్చనలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

తలనీలాల సేకరణ వేలం రూ.1.39 కోట్లు

నార్కట్‌పల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తలనీలాల సేకరణ వేలం రూ. 1.39 కోట్లు పలికింది. ఇంతకు ముందు దేవస్థానంలోనే మూడు పర్యాయాలు నిర్వహించిన తలనీలాల సేకరణ వేలంపాటకు వేలందారుల నుంచి కనీస ధర రాలేదు. దీంతో ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం హైదరాబాద్‌లోని శాఖ ప్రధాన కార్యాలయంలో ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ ఎంఎండీ. కృష్ణవేణి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఒక సంవత్సర కాలపరిమితికి నిర్వహించిన ఈ బహిరంగ వేలంలో మొత్తం 16 మంది వేలందారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొలకలూరుకు చెందిన శ్రీ భాస్కర్ ఇండియన్ హెయిర్ అనే సంస్థ అత్యధిక పాట పాడింది. కార్యక్రమంలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లిని సందర్శించిన 'యూఆర్‌ఎక్స్' విద్యార్థి బృందం

- చేనేత కళాకారుల ప్రతిభకు ప్రశంస


భూదాన్‌పోచంపల్లి కళాపునర్వి యూనిట్ సందర్శించిన ఫ్యాషన్ టెక్నాలజీ బృందం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చేనేత, స్వదేశీ తయారీకి అంకితమైన సంస్థ యూఆర్‌ఎక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం విద్యా పర్యటన కోసం భూదాన్‌పోచంపల్లిని సందర్శించింది. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును అభ్యసించే విద్యార్థుల బృందం క్షేత్ర పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించారు. చేనేత టైఅండ్‌డై వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. శ్రీరంజన్ సిల్క్ యూనిట్ సందర్శించి సీడ్ టూ క్లాత్ ప్రాసెసింగ్ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రూరల్ టూరిజం సెంటర్‌లోని మ్యూజియాన్ని సందర్శించారు. చేనేత మగ్గంపై వస్త్ర తయారీని, చేనేత టైఅండ్‌డై ఇక్కత్ డిజైన్లను పరిశీలించి, కళాత్మక డిజైన్లను రూపొందించిన చేనేత కళాకారుల ప్రతిభను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో యూఆర్‌ఎక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ డైరెక్టర్ ఊర్వశి సోని మాట్లాడుతూ విద్యార్థులు ఫ్యాషన్, ఫ్యాషన్ రంగంలోని విభిన్న అంశాలను అన్వేషించడానికి దేశంలోని వివిధ నగరాలను సందర్శిస్తుంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


కోదాడలో రాష్ట్రస్థాయికి ఎంపికైన తేజ విద్యార్థులు

కోదాడరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కొమరబండ తేజ విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమా సోమిరెడ్డి తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన చీఫ్ మినిస్టర్ కప్ పోటీల్లో తేజ విద్యాలయానికి చెందిన 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రతిభచాటారు. పాఠశాలకు చెందిన భాగ్యశ్రీ, యజ్ఞశ్రీ, క్షతజ్ఞ, ప్రణవి, సింధు, జాహ్నవి, తపస్వీలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

- మిర్యాలగూడ టౌన్, (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు పట్టణ క్రీడాకారులు ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-15 బాలుర విభాగంలో అక్షిత్‌రెడ్డి, మణి శంకర్, అలీ, సాయిశ్రీనివాస్, బాలికల విభాగంలో చందన, లిల్లీగ్రేస్, తేజస్విని, యశస్వినీ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. అండర్ -19 విభాగంలో అన్విత్, నిహాల్‌రెడ్డి, షణ్ముఖ, బర్రేష్, అర్జున్, ప్రజ్ఞిత్‌రామ్, లాస్య, హర్షిత రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో యారాల ప్రభాకర్‌రెడ్డి, ప్రకాష్, నారాయణ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకుంటే అసెంబ్లీ ముట్టడి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

నల్లగొండరూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే అసెంబ్లీ ముట్టడి తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సమగ్రశిక్ష ఉద్యోగులు తొమ్మిది రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ బుధవారం సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు మాట మార్చుతున్నారని విమర్శించారు. వారు పనిచేస్తున్న విద్యాశాఖలోనే విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 19,300, జిల్లాలో 1100 మంది వివిధ విభాగాల్లో పని చేస్తున్నారని, వారు 20 సంవత్సరాలుగా విద్యాశాఖ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వీరికి న్యాయం చేయాలని లేనిచో అసెంబ్లీ ని ముట్టడించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌లను కలిసి సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. దీక్షలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నెలపట్ల సత్యనారాయణ, కేశబోయిన శంకర్‌ముదిరాజ్, మధు తదితరులు పాల్గొన్నారు.

శిల్పకళా ఖండాలను కాపాడుకోవాలి

నాగార్జునసాగర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఇందిరాగాంధీ సర్కిల్ వద్ద ఉన్న మాధవస్వామి ఆలయం ప్రాంగాణంలో నిర్లక్ష్యంగా పడి ఉన్న కాకతీయుల కాలం నాటి శిల్పకళాఖండాలను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన హిల్‌కాలనీలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత మాధవ ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగాణంలో ఉన్న 700 ఏళ్ల నాటి నంది విగ్రహాలు, ఆలయ ద్వారాలు, సహస్ర లింగాలు గుర్తించారు. శిల్పఖండాలను భద్రపర్చి భావితరాలకు అందుబాటులోకి తీసుకవస్తే బాగుంటుందన్నారు. 1954-60 మధ్య కాలంలో నాగార్జునసాగర్ జలాశయంలో ముంపునకు గురైన ఏలేశ్వరం నుంచి ఈ విగ్రహాలను తీసుకవచ్చి హిల్‌కాలనీలో నిర్లక్ష్యంగా పడవేశారన్నారు. 65 ఏళ్ల విగ్రహాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నా యన్నారు. ఆలయ అధికారులు స్పందించి ఈ విగ్రహాలను భద్రపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


లింగమంతులస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్

చివ్వెంల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో త్వరలో జరగబోయే దురాజ్‌పల్లి శ్రీలింగమంతులస్వామి జాతర ఏర్పాట్లకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ అన్నారు. సూర్యాపేట పట్టణ సమీపంలోని లింగమంతులస్వామి దేవాలయాన్ని అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలెక్టర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జాతర ఏర్పాట్లకు సంబంధించిన పనుల ప్రణాళికను పరిశీలించి మాట్లాడారు. ఫిబ్రవరి 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతర జరుగుతుందన్నారు. జాతర ఏర్పాట్లలో ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని, జాతర సజావుగా నిర్వహించడానికి కావాల్సిన పనుల అంచనా విలువలను అధికారులు సిద్ధం చేయాలన్నారు. జాతర జరిగే అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణకు గుట్టపైన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతరలో విధులు నిర్వహించే సిబ్బందికి పాస్‌లు జారీ చేయాలన్నారు. వాలంటీర్లకు పోలీసుల అనుమతితో కూడిన గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. ప్రొటోకాల్ కోసం దేవాలయం వద్ద ఒక అధికారిని నియమించాలన్నారు. ప్రజలకు తాగునీరు నిరంతరం అందేలా ఏర్పాట్లు ఉండాలని తాగునీటి కుళాయిల వద్ద సోప్ షీట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ పరంగా దేవాలయం ప్రాంతం చుట్టూఔ ఉన్న భూములకు సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంతో పార్కింగ్, ప్రదేశాలు ఎగ్జిబిషన్ ప్రదేశాలు, భోజనాలు చేసే ప్రదేశాలను గూగుల్ స్కెచ్ తయారు చేసి అందించాలన్నారు. గుడి పైన ఏర్పాట్లను దేవాదాయ శాఖ, గుడి కింద ప్రాంతాలను మునిసిపల్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గుడిపక్కన ఉన్న రహదారులకు బారికేడ్లను మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు, దేవాలయ శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. జాతర గుర్తుగా బెలూన్ ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈఢ కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ బాషా, డీఎస్పీ రవి, ఈవో కుశలయ్య, ఆలయ పూజారులు శ్రీశైలం, శ్రీను, తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, మిషన్ భగీరథ అధికారులు శ్రీనివాస్, అరుణాకర్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'కస్తూరి' చేయూత

» ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన
» 2017 నుంచి సేవలందిస్తున్న కస్తూరి శ్రీచరణ్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ (ఫైల్)

గట్టుప్పల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో ప్రతి ఒక్కరూ విద్యాభ్యాసం చేయాలనే లక్ష్యంతో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ ముందుకుసాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించడమే కాకుండా కస్తూర్బా విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తున్నారు. ప్రతి పేద,సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులను సరస్వతీ పుత్రులుగా చూడాలనే సంకల్పంతో పాఠశాలలు, విద్యాలయాలకు ఫౌండేషన్ ద్వారా కస్తూరి శ్రీచరణ్ చర్యలు చేపడుతున్నారు. 2017 సంవత్సరం జూన్ 22న ప్రారంభమైన కస్తూరి ఫౌండేషన్ విద్యార్థులకు చేయూతనందించేందుకు కృషి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఏటా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను అందిస్తున్నారు. అంతేకాక కేజీబీవీ విద్యాలయాల్లో విద్యార్థినులకు మౌలిక వసతులను కల్పిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలను హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేజీబీవీలో మౌలిక వసతులకు కృషి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిరుమలగిరి, వలిగొండ, చౌటుప్పల్, సంస్థాన్నారాయణపురం, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి, పీఏపల్లి, గుర్రంపోడు, కనగల్ మండలాల్లో కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ సేవలందిస్తున్నారు. ఆయా మండలాల్లో కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. నీటి సమస్య తాగునీటి సౌకర్యం కల్పించి విద్యుదీకరణ చేయించి, విద్యార్థినులకు స్టడీ మెటీరియల్, క్రీడా సామగ్రి, బెంచీలు అందించారు. ఆయా పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు ఫౌండేషన్ ద్వారా రూ. సుమారు 8 లక్షలకు పైగా వెచ్చించి మౌ లిక వసతులను మెరుగుపరిచారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న సుమారు 25వేల మంది విద్యార్థినులకు కస్తూరి ఫౌండేషన్ ద్వారా చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ 10వ తరగతి స్టడీ మెటీరియల్ను పంపిణీ చేస్తున్నారు. 8 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాల్లోని 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా ఈసారి విద్యార్థులకు దాదాపు రూ. 50లక్షల విలువైన స్టడీ మెటీరియల్ను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మౌలిక వసతులు కల్పించారు



తమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. మూత్రశాలల మరమ్మతులతో పాటుగా విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్, క్రీడా సామగ్రి, బెంచీలను సమకూర్చారు. కేజీబీవీ విద్యాలయంలో తమకు ఇబ్బందులు కలగకుండా కస్తూరి ఫౌండేషన్ ద్వారా మౌలిక వసతులను కల్పించడం సంతోషంగా ఉంది. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాలల, విద్యాలయాల అభ్యున్నతికి కృషిచేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్కు కృతజ్ఞతలు.

- చిలుముల ఇందు, 10వ తరగతి విద్యార్థిని,మునుగోడు కేజీబీవీ విద్యాలయం

విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం పెరగాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి. అంతేకాక ఉత్తీర్ణత శాతం పెరగాలనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ పనిచేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడం వల్ల పేద, సామాన్య కుటుంబాలకు చెందిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, ఉత్తీర్ణత శాతం పెరగాలనే లక్ష్యంతో ఫౌండేషన్ పనిచేస్తుంది. ఈ ఏడాది 25వేల మంది 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను అందజేస్తాం. 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నదే మా ఉద్దేశం. అంతేకాకుండా 10 జీపీఏకు 10ని అత్యధిక విద్యార్థులు సాధించాలని మా ఆకాంక్ష.

- కస్తూరి శ్రీచరణ్, కస్తూరి ఫౌండేషన్ చైర్మన్

ఫటాఫట్

ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదు

వెంకటేశ్వర్లు, ఏఈ, ఆర్డబ్ల్యూఎస్



మర్రిగూడ మండలంలోని 22 గ్రామ పంచాయతీలు, 29 ఆవాస గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నాం. మండలంలో 2018 నుంచి ఇప్పటి వరకు ఫ్లోరైడ్ కేసులు నమోదు కాలేదు. ప్రతీ నెలా నీటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. అందులో క్లోరిన్ శాతం జీరోగా ఉంటుంది.

(మర్రిగూడ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మంది మిషన్ భగీరథ నీటిని తాగుతున్నారు.

ఏఈ : మండలంలో 13,146 గృహాలకు నల్ల కనెక్షన్ ఇచ్చాం. 42 వేల మంది మిషన్ భగీరథ నీటి తాగుతున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు ఉన్నాయి? ఇంకా ఎన్ని ట్యాంకులు అవసరమవుతాయి.

ఏఈ: ప్రస్తుతం మండలంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు 62ఉన్నాయి. ఇంకా 12ట్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఫ్లోరైడ్ సోకిన వారిని ఎంత మందిని గుర్తించారు?

ఏఈ: 2018 నుంచి 2024 వరకు ఇప్పటి వరకు ఫ్లోరైడ్ వ్యాధిగ్రస్థులు నమోదు కాలేదు.

ఆంధ్రజ్యోతి: నీటిలో క్లోరిన్ ఎంత శాతం ఉందని పరీక్షలు నిర్వహిస్తున్నారా?

ఏఈ: మిషన్ భగీరథ నీటిలో క్లోరైడ్ శాతం కోసం ప్రతీనెలా నీటి పరీక్షలు చేస్తున్నాం. అందులో క్లోరిన్ శాతం జీరో ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగుతున్నాయి.

ఏఈ: గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుంది. ఎలాంటి అంతరాయాలు లేవు.

మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సురేంద్రనాథ్

నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నామారాము సురేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేంద్రనాథ్, కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారిగా రుద్రాక్షి భిక్షం ఎన్నికయ్యారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి జె.శేఖర్రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు నర్సింహాచారి, కార్యవర్గసభ్యులు విజయ్ కృష్ణ, రణదేవ్, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ మోహన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'పిడికెడు మట్టి' నవలకు పురస్కారం

నార్కట్పల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నార్కట్పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వర్ధమాన కవి బండారు శంకర్ రాసిన 'పిడికెడు మట్టి' అనే నవల పురస్కారానికి ఎంపికైంది. డిసెంబరు 24వ తేదీన అంపశయ్య నవీన్ జన్మదినోత్సవం సందర్భంగా హన్మకొండలో నిర్వహించే కార్యక్రమంలో బండారు శంకర్కు ట్రస్టు తరఫున పురస్కారం అందజేయనున్నారు. 'పిడికెడు మట్టి' నవలా రచయిత, కవి బండారు శంకర్కు అంపశయ్య నవీన్ అవార్డు రావడంపై జిల్లాకు చెందిన పలువురు కవులు రచయితలు అభినందనలు తెలిపారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధ్యం : గొంగిడి

మునుగోడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశం అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్రెడ్డి స్పష్టం చేశారు. మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. మండలంలోని ఇప్పర్తి గ్రామానికి గోలి లింగస్వామిరజక ఆధ్వర్యంలో సుమారు 50మంది ముఖ్య నాయకులతో పాటు వివిధ గ్రామాల్లోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు తమ అనుచరులు మనోహర్రెడ్డి నాయకత్వంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం మాట్లాడారు. దేశంలో అవినీతి రహిత పాలన నరేంద్రమోదీ నాయకత్వంలో సాగుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాగించిన అవినీతి అక్రమాలు కాంగ్రెస్ పాలనలోనూ సాగుతున్నాయని విమర్శించారు. రేవంత్రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు వేణుకుమార్, నరేందర్గౌడ్, భవనం మధుసూదన్రెడ్డి, పగిళ్ల బిక్షంరజక, బండారు యాదయ్య, పులకరం నర్సింహ, లింగస్వామి, గోవింద్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మనోహర్రెడ్డి, వర్షిత్రెడ్డి

పార్టీకి బూత్ కమిటీలే పట్టుగొమ్మలు : నాగం

కేతేపల్లి: పార్టీకి బూత్ స్థాయి కమిటీలే పట్టుగొమ్మలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్రెడ్డి అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మూడు బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీలు బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా చెవుగోని రాజు, రాచకొండ శ్రవణ్, పొడిశెట్టి రవిలకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఆర్.గోపి, ఎస్సీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చినేని జానయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, కిసాన్మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్.మొగులయ్య, నాయకులు ఎ.అనిత, కొరివి శంకర్, మధుకర్రెడ్డి, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా నిర్వహించాలి

మర్రిగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్వహించే ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. మండలంలోని తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి, సరంపేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదల దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి తప్పులు లేకుండా ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఏ ఒక్క ఇల్లు మరిచిపోకుండా ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించి లబ్ధిదారులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి యూసుఫ్, పలువురు అధికారులు ఉన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు శిక్షణ



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నల్లగొండ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేంద్రీయ వి ద్యాలయంలో హైదరాబాద్ ప్రాంతంలోని 72 కేంద్రాల మహిళ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభమైంది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మహిళా విభాగం శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ వర కు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 72 కేంద్రాల నుంచి 131 మహిళ ఉపాధ్యాయులకు 12మంది శిక్షణ ఇచ్చే వారు వచ్చారు. ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వ హించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీబీఎస్అండ్జీటీ ధనలక్ష్మి, దక్షిణ వధ్య రైల్వే వహిదా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పర్యావరణ సంరక్షకుడు సురేష్ గుప్త, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు

(5వపేజీ తరువాయి)

లోనే ఆధునిక టెక్నాలజీగల రైస్ మిల్లులుండడంతో ఇక్కడ మిల్లర్ల కొనుగోళ్ల తాకిడికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం రాని పరిస్థితి సీజన్ ఆసాంతం కొనసాగింది. ప్రధానంగా మిర్యాలగూడ కేంద్రంగా ఉన్న రైస్మిల్లుల్లో సీజన్ మొదట్లో కొంత తక్కువ ధర ఇచ్చిన మిల్లర్లు, ఆ తర్వాత ధాన్యం తగ్గిపోవడంతో ధరను పెంచేశారు. ధాన్యం తేమశాతం పట్టించుకోకుండా క్వింటాకు కనీసం రూ.2200నుంచి ఇటీవల క్వింటాకు రూ.2800వరకు ఇచ్చారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే 17శాతానికి మించి తేమ ఉంటే కొనడంలేదు. ఈ కారణంతో పాటు, ధాన్యం ఆరబెట్టుకుంటే వారంపాటు వచ్చే ఖర్చులను పరిగణనలోకి తీసుకొన్న రైతాంగం సన్నరకం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు విక్రయించేశారు. ఈ సీజన్లో ఇప్పటివరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 37,435 మెట్రిక్ టన్నుల సన్నధాన్యమే కొనుగోలు చేస్తే, అదే మిల్లర్లు ఇప్పటికే 6,03,450 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తంగా సన్నధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల హవానే కొనసాగింది.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి


పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కోటేశ్వర్రావు

● ఇండస్ట్రీయల్ జీఎం కోటేశ్వర్రావు

నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఇష్టమైన ఆటలో రాణించాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కోటేశ్వర్రావు అన్నారు. పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో బుధవారం వాలీబాల్, పుట్బాల్, జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు, యువకులకు విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. డీఈవో భిక్షపతి మాట్లాడుతూ వాలీబాల్, పుట్బాల్ క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాడానికి ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు పలు క్రీడాంశాల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటే విధంగా మెళకువలు పాటించాలన్నారు. అనంతరం వాలీబాల్, పుట్బాల్ క్రీడా పోటీలను, డీఈవో భిక్షపతితో కలిసి జీఎం పుట్బాల్ ఆటను ఆడి ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్వో కుంభం నర్సిరెడ్డి, ఎస్జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఇందిర, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు గిరిబాబు, కరీం, కవిత, కరుణాకర్రెడ్డి, యుగంధర్, కిరణ్, నజీర్, సురేష్, అనిల్, నారాయణరెడ్డి, బాలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీపీ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

మునుగోడురూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎస్ఐ ఇరుగు రవి, ఎంఈవో రవీందర్ అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో గల జడ్పీ హైస్కూల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన స్టేజీ నిర్మాణానికి బుధవారం వారు భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామంలో విద్య వైద్య సౌకర్యాలు మెరుగు పడ్డప్పుడే ఆ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ వెదిరే విజేందర్రెడ్డి, మాజీ సర్పంచులు జాల వెంకన్నయాదవ్, బోయపర్తి లింగయ్య, నాయకులు దామ్ యాదయ్య, జీడిమడ్ల మల్లయ్య, జాల నరసింహ, మోగుదాల శివగౌడ్, వీరమల్ల అశోక్, జీడిమడ్ల నరసింహ, బాజా మనోజ్, శంకరయ్య, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలుచేయాలి

గట్టుప్పల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 19, 20 తేదీల్లో గట్టుప్పల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చాపల మారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి పార్టీ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, నాయకులు చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, బొట్ట శివకుమార్, నగేష్, రాములు, శ్రీనివాస్, రావుల నరసింహ, యాదగిరి, శ్రీనివాస్, .కృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్లో వనిపాకల విద్యార్థి ప్రతిభ

చిట్యాలరూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్లో చిట్యాల మండలం నేరడ జడ్పీహెచ్ఎస్కు చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించాడు. నల్లగొండలో ఈ నెల 16 తేదీన టీఎంఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టను నిర్వహించారు. టెస్ట్లో విద్యార్థి బక్కతట్ల మల్లేష్ ప్రతిభచాటి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించాడు. మల్లేష్ను నిర్వాహకులు ప్రశంసాపత్రం జ్ఞాపికను అందజేసి అభినందించారు. అదేవిధంగా మండలస్థాయిలో నిర్వహించిన టెస్ట్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను తెలుగు మీడియంలో బక్కతట్ల మల్లేష్, మేడి హరిని, బర్రె ధనలక్ష్మి సాధించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మల్లేష్ను, మండలస్థాయిలో ర్యాంకును సాధించిన విద్యార్థులను హెచ్ఎం బాణాల శీనయ్య, ఉపాధ్యాయులు దంతూరి సైదులు, గంపల రవీందర్రెడ్డి, కవిత, జ్యోతి, చొల్లేటి నర్సింహాచారి, నజీర్ఉన్నీసా, విజయ, మహేందర్రెడ్డి, తల్లిదండ్రులు అభినందించారు.


పడి పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో అయ్యప్ప స్వామిని ఆశీనులను చేసి ప్రత్యేకంగా 18 మెట్లను పడిని ఏర్పాటు చేసి గురుస్వాములు నోముల శ్యాం, కొలనుపాక రవికుమార్, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామి వారికి పంచామృతాలతో వైభవంగా పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం హాజరై భక్తులందరికీ అన్నప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్గౌడ్, వంగాల అనిల్రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మేడం విశ్వప్రసాద్, రాంపాటి శ్రీను, పృథ్వీధర్ రెడ్డి, కౌన్సిలర్లు, అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి: నాంపల్లి మండల కేంద్రంలోని శివాలయంలో అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. గౌరు ప్రశాంత్స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుంభం కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజశేఖర్రెడ్డి, నాంపల్లి హనుమంతు, వీరమళ్ల నాగరాజు, కిరణ్, చరణ్రెడ్డి అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

తిరుమలగిరికి షటిల్ బస్సులు నడిపించాలి

శాలిగౌరారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నుంచి వల్లాల, శాలిగౌరారం, గురజాల, మానాయికుంట, అడ్డగూడూర్ మీదుగా తిరుమలగిరికి షటిల్ బస్సులు నడిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గురజాల, మానాయికుంట గ్రామాల మధ్యలో ఉన్న మూసీ నదిపై బ్రిడ్జి నిర్మించి రెండేళ్లవుతున్నా ఈ మార్గంలో బస్సులు నడిపించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. నకిరేకల్ నుంచి తిరుమలగిరికి షటిల్ బస్సులు నడిపిస్తే నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగామ, వరంగల్ జిల్లాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. నల్లగొండ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంటనే స్పందించి తిరుమలగిరికి, అదే విధంగా నకిరేకల్ నుంచి శాలిగౌరారం, గురజాల, అమ్మనబోలు మీదుగా జగద్గిరిగుట్టకు బస్సులు నడిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు నిమ్మల మధు, బండారు భరత్ పాల్గొన్నారు.

'మోడల్' టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

శాలిగౌరారం, కనగల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీవో పద్మ, ఎంఈవో సైదులు, డీటీ వరప్రసాద్కు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. 010 ద్వారా వేతనాలు, పదోన్నతులు, నోషనల్ సర్వీస్ వంటి అనేక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీజీఎంఎస్ వల్లాల ఉపాధ్యాయులు, పీఎంటీఏ టీఎస్ రాష్ట్ర కన్వీనర్ కుక్కడపు శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, చిత్తలూరి సత్యనారాయణ, కృష్ణయ్య, కేతేపల్లి శ్రీను, సంధ్యారాణి, శ్రీరాములు, శ్వేత, సంగీత పాల్గొన్నారు.

● కనగల్లో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంఈవో పద్మకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా పీఎంటీఏ టీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్ మాట్లాడుతూ మోడల్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు థామసయ్య, శ్రీనివాస్, భద్రయ్య, రాజేందర్, రామకృష్ణ, శ్రీనివాస్గౌడ్ పాల్గొన్నారు.


శాలిగౌరారం: ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

కార్మికులను అరెస్టు అప్రజాస్వామికం

మర్రిగూడ: గ్రామపంచాయతీ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ వెళ్తున్న కార్మికులను ఎక్కడికక్కడే నిర్బంధించడం అన్యాయమన్నారు. మర్రిగూడ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యా లీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికైనా జీపీ కార్మికులకు గ్రామపంచాయతీ వర్కర్లకు ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాలు అందజేసి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని వారు కోరారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో మంజుల, ఉరిపక్క లింగయ్య, పోలే రాములు, అంజయ్య ముత్తమ్మ, ఐతపాక పద్మ తదితరులు ఉన్నారు.

పెద్దులు మృతి పార్టీకి తీరని లోటు: నంద్యాల

నార్కట్పల్లి: సీపీఎం సీనియర్ నాయకుడు మెరుగు పెద్దులు మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు పెద్దులు బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై ఆయన పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు చెర్కు పెద్దులు, కల్లూరి యాదగిరి, కొప్పు శ్రవణ్, దండు రవి, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదు: రమేష్

గట్టుప్పల్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. బుధవారం వెల్మకన్నె గ్రామంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తోందని అన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

చండూరు : గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ నెలా పట్టణంలో ఉన్న నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేయడం చండూరు ఎస్ఐ వెంకన్న అన్నారు. చలి తీవ్రతతో బాధపడుతున్న వృద్ధులకు దుప్పట్లు, చీరలు, నిత్యావసర సరుకులను బుధవారం గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఉచితంగా అందజేశారు. ప్రతీ ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులును అభినందించారు.


నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోడి శ్రీనివాసులు

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలి

నాంపల్లి : విద్యార్థుల భవిష్యత్కు వారి తల్లిదండ్రులు సహకరించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం మోహన్రావు కోరారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాలమేరకు రూపొందించిన 90 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుకు తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

చిన్నారులకు అనుబంధ ఆహారం అందించాలి

మర్రిగూడ: చిన్నారులు ఆరు నెలల నిండిన తర్వాత అనుబంధ ఆహారం అందించాలని అంగన్వాడీ సూపర్వైజర్ యశోద అన్నారు. బుధవారం ఎరుగండ్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 18.0



జిల్లాకేంద్రం నుంచి ధాన్యం ఎగుమతి చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు

ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. దొడ్డురకాల ధాన్యమంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే కొనుగోలు చేస్తుంటే, సన్నరకాల ధాన్యం కొనుగోళ్లలో మాత్రం మిల్లర్లు హవా కొనసాగించారు. ఇంకోవైపు ధాన్యం కొనుగోళ్లు ముగుస్తున్న సందర్భంలో కొందరు దళారులు ఇక్కడి సన్నధాన్యానికి ఉన్న డిమాండ్‌ని, బోనస్‌ని సొమ్ము చేసుకునేందుకు ఏపీలోని గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి దొడ్డిదారిన ధాన్యాన్ని తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు, అధికారయంత్రాంగం అప్రమత్తమవడంతోపాటు సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించి తనిఖీలు ముమ్మరం చేశారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

▸▸ సన్నాల కొనుగోళ్లలో మిల్లర్లదే హవా ▸▸ ఏపీ నుంచి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు

జిల్లాలో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు చేరాయి. ఈ సంవత్సరం అక్టోబరులో మొదలైన వరి కోతలు దశలవారీగా ఇప్పటి వరకు కొనసాగుతుండడంతో కొనుగోళ్లు సైతం కొనసాగుతూనే ఉన్నాయి. వరికోతలు దాదాపు చివరిదశగా చేరగా, ధాన్యం కాంటాలు ఈ నెలాఖరు వరకు కొనసాగే అవకాశం కన్పిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 2,28,416 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, అందులో దొడ్డురకాలు 1,90,980 మెట్రిక్‌టన్నులు, సన్నరకం ధాన్యం 37,435 మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉంది. ఈ ధాన్యానికి సంబంధించి 42,609 మంది రైతులకు, మొత్తం రూ.529.92కోట్ల విలువైన ఖరీదులు జరిగాయి. ఇందులో రూ.496.21 కోట్ల మొత్తం రైతులకు అందజేయగా, బిల్లులు సబ్మిట్ చేసిన మిగిలిన మొత్తం కూడా వా రం రోజుల్లో చెల్లింపులు జరుగుతాయని అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రభు త్వ కొనుగోళ్లు గత సీజన్‌కంటే తక్కువగా నమోదయ్యాయని, గతేడాది ఇదే సమయానికి దాదాపు 3.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యంకొనుగోళ్లు జరిగాయని, ఈసారి మిల్లర్ల కొనుగోళ్లు ఎక్కువగా ఉండడంతో కేంద్రాలకు వచ్చే ధాన్యం తగ్గి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఏపీ నుంచి ధాన్యం రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సన్నధాన్యానికి తెలంగాణలో రూ.500 బోనస్ ఇస్తుండడంతో దీన్ని సొమ్ము చేసుకునేందుకు కొందరు దళారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలోని గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి వాడపల్లి, నాగార్జునసాగర్, మట్టపల్లి, కోదాడ, మేళ్లచెరువు ప్రాంతాలమీదుగా రాత్రివేళల్లో ట్రాక్టర్లు, లారీల్లో ధాన్యం తెచ్చి ఇక్కడి రైతుల పేరున విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ సరిహద్దుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించడంతో జిల్లాల్లో సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు, సరైన రవాణా పత్రాలు లేకపోతే ధాన్యం వాహనాలను మిల్లులకు వచ్చేవాటిని సైతం వెనక్కిపంపిస్తున్నారు. వ్యాపారులు, మిల్లర్లు రవాణా పత్రాలతో ఏపీ నుంచే కాదు ఎక్కడి నుంచైనా ధాన్యం తెచ్చుకోవచ్చని, దానికి అభ్యంతరం లేదని, కానీ ఎలాంటి పత్రాల్లేకుండా ఇక్కడి రైతుల పేరున ధాన్యం తీసుకొస్తే మాత్రం సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సన్నాల కొనుగోళ్లలో మిల్లర్లదే హవా

సంక్రాంతి నుంచి రేషన్ బియ్యంగా, హాస్టళ్లు, గురుకులాల్లో పిల్లలకు సన్నబియ్యంతో వండిన అన్నమే పెట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమేరకు సన్నధాన్యం ఉత్పత్తిని పెంచేందుకు ప్రోత్సాహకాన్ని రైతులకు ప్రకటించింది. సన్నధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అయితే వరి సాగు ఎక్కువగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రాష్ట్రం...

- మిగతా 8వ పేజీలో..



పొరుగు రాష్ట్ర ధాన్యం కొనుగోలు చేయబోం



పొరుగురాష్ట్రం నుంచి ధాన్యం అక్రమంగా రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయించాం. ఎట్టిపరిస్థితుల్లో ఇక్కడి రైతుల పేరుతో ఇతర రాష్ట్రాల ధాన్యాన్ని కొనుగోలు చేయం. క్షేత్రస్థాయిలో ఎవరైనా అలాంటి ప్రయత్నాలు చేస్తే మాదృష్టికి తీసుకువస్తే కఠినచర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో సాగువివరాలు, రైతుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్థానిక రైతులకు ఎంత ధాన్యం పండిందో అంతమేరకే ధాన్యం విక్రయాలకు వ్యవసాయ శాఖ అనుమతిస్తుంది. ఆ ధాన్యాన్నే కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు తప్ప దళారులు తెచ్చేధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదు.

- వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, నల్లగొండ



వార్డు ఆఫీసర్లు.. వచ్చేస్తున్నారు

- ▸▸ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 180 మంది కేటాయింపు
- ▸▸ వార్డుల్లో సమస్యల పరిష్కారంతో పాటు పన్నుల వసూళ్ల బాధ్యత
- ▸▸ సమస్యలపై వార్డు ఆఫీసర్లను సంప్రదించాల్సిన ప్రజలు

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు పాలనాపరమైన విధులను అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. రెవెన్యూ పనులకు సం బంధించి ఆర్ఐలు, డీటీలు విధులు నిర్వహిస్తున్నారు. మునిసిపాలిటీల్లో మాత్రం ప్రజలకు వా రి అవసరాల కోసం మునిసిపల్ కార్యాలయాల కు వెళ్లి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. మునిసిపల్ కార్యాలయం నుంచే ప్రజలకు అవసరమై న సేవలు అందడంతోపాటు సమస్యల పరిష్కా రం లభిస్తుంది. కానీ ఇక నుంచి మునిసిపాలిటీల్లోని ప్రజలు మునిసిపల్ కార్యాలయాలకు వెళ్లకుండానే వారు నివసిస్తున్న వార్డునుంచే వారి పనులను చక్కబెట్టుకోవచ్చు. అంతేకాకుండా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కూడా వార్డు ఆఫీసర్ల ద్వారా పరిష్కరించుకునే అవకాశం లభించింది. ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ప్రజల కు పరిపాలనను చేరువ చేసేందుకు తాజాగా వార్డు ఆఫీసర్లను నియమించింది. మునిసిపల్..

మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 180 మంది వార్డు ఆఫీసర్లు

ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలకు మొత్తం 180 మంది వార్డు ఆఫీసర్లను నియమించారు. నల్లగొండ జిల్లాలో ఎనిమిది మునిసిపాలిటీలుండగా 77మంది, సూర్యాపేట జిల్లాలో ఐదు మునిసిపాలిటీలుండగా 62 మంది, యాదాద్రి జిల్లాలో ఆరు మునిసిపాలిటీలకు 41మందిని కేటాయించారు. అయితే నల్లగొండ మునిసిపాలిటీకి 41 మంది, మిర్యాలగూడకు 22మంది, దేవరకొండకు నలుగురు, హాలియా, చిట్యాల, చండూరుకు ఒక్కొక్కరు, నకిరేకల్‌కు ఐదుగురు, నందికొండకు ఇద్దరిని కేటాయించారు. అదేవిధంగా సూర్యాపేట మునిసిపాలిటీకి 39 మం ది, కోదాడకు 12 మంది, హుజూర్‌నగర్‌కు 8 మంది, తిరుమలగిరికి ఇద్దరు, నేరేడుచర్లకు ఒక్కరిని కేటాయించారు. యాదాద్రి జిల్లాలో భువనగిరి మునిసిపాలిటీకి 23 మం ది, చౌటుప్పల్‌కు ఆరుగురు, యాదగిరిగుట్టకు ముగ్గురు, మోత్కూరుకు ముగ్గురు, ఆలేరుకు ముగ్గురు, భూదాన్‌పోచంపల్లికి ముగ్గురిని కేటాయించారు.

జిల్లా వ్యవసాయ అధికారితో నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 7288800023



నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో విత్తనాలు, ఎరువులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం 19వ తేదీన జిల్లా వ్యవసాయ అధికారి పి. శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జేడీఏ జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతులు అడిగే ప్రశ్నలు, సందేహాలకు సమాధానం ఇస్తారు. 7288800023 నెంబర్‌కు ఫోన్ చేస్తే వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రశ్నలకు జేడీఏ సమాధానం ఇస్తారు. జిల్లాలోని రైతులు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ఫోన్‌ఇన్‌ను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ సీజన్‌కు సంబంధించి విలువైన సమాచారం తెలుసుకునేందుకు వీలు ఉంటుంది.

మాతా శిశు మరణాలు లేని జిల్లాగా మార్చాలి



కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండను మాతా శిశు మరణాలు లేని జిల్లాగా మార్చాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత మాతృ మరణాలు, శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. మాతృ, శిశు మరణాలు జరిగితే అందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వాహించాలన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంతో ఏ తల్లీ బాధ పడకూడదన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు, ప్రసవానంతరం కూడా పూర్తిగా వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ పర్యవేక్షణలో ఉండాలన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు, ఇమ్యునైజెషన్, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా కొన్ని మెడికల్ షాపుల్లో మందులు, ఆస్పత్రుల్లో అబార్షన్ కిట్లు విక్రయిస్తున్న తమ దృష్టికి వచ్చిందన్నారు. వైద్యుల అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాణాలు కాపాడటమే వైద్యులు విధిగా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉండా లన్నారు. మాతాశిశు మరణాలు నివారించే విషయంలో ఇకపై ఏరియా ఆసుపత్రుల వారీగా, డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్, అబార్షన్ వంటి వాటి పట్ల పట్టణస్థాయి మొదలుకొని గ్రామస్థాయి వరకు అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

కొండమల్లేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిచాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి సూచించారు. మండలంలోని గుర్రపుతండా పరిధిలోని దర్గాతండాలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పరిశీలించారు. ఇల్లు మొత్తం వచ్చేలా ఫొటోలో తీయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని వలస వెళ్లిన వారికి ఫోన్ లేదా ఇతరత్ర మార్గాల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

గుర్రంపోడు, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశించారు. మండలంలోని జిన్నాయిచింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం పరిశీలించారు. సర్వే వివరాలు పంచాయతీ కార్యదర్శి స్వీటీ, ఎంపీడీవో మంజులను అడిగి తెలుసుకున్నారు. జిన్నాయిచింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 177 మంది దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు 77 దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి అప్‌లోడ్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీవో పద్మ ఉన్నారు.

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆమె వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో బాలరాజురెడ్డి ఉన్నారు.

చింతపల్లి ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

చింతపల్లి, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చింతపల్లి ఎంపీడీవో సుజాతకు కలెక్టర్ ఇలాత్రిపాఠి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని గానీరాంతండా, నసర్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు బుధవారం క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.

గ్రామానికి చెందిన రమావత్ శంకర్, కొర్ర సరిత తదితర దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాస్తుల్లో ఫొటోలతో వివరాలు పొందుపరచలేదు. ఆన్‌లైన్ యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలను దోచి పెద్దలకు పంచుతున్న మోదీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పేదలను దోచి కార్పొరేట్ పెద్దలకు పంచి పెడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు కాంట్రాక్టర్లకు, కార్పొరేటర్లకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పేదలను విస్మరిస్తున్నాయన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు అధికారంలో ఉండడం వల్ల మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తిరిగి ఢిల్లీలో రైతులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. మణిపూర్‌లో అల్లరు జరిగి పరిస్థితులు ప్రమాదకరంగా మారినప్పటికీ, ప్రజల్లో శాంతి నెలకొల్పేందుకు ప్రధాని ఆ ప్రాంతాన్ని సందర్శించక పోవడం శోచనీయమన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, పిల్లుట్ల సైదులు, చనగాని సైదమ్మ, కందుకూరి రమేష్‌బాబు, కన్నెకంటి రామకృష్ణ, ఉన్నం వెంకటేశ్వర్లు, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకునేవరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న మధుబాబు

నల్లగొండ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకునేవరకు పోరాటం ఆగదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమల్ల మధుబాబు స్పష్టం చేశారు. సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాలలను కించపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న ప్రకటనపై ఈ నెల 19న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు మాలలు ఎంతో కృషిచేశారని తెలిపారు. మందకృష్ణ మాదిగ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడి వర్గీకరణ చేస్తే ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో అన్నిమల్ల లింగస్వామి, అంగరాజు స్వర్ణలత, కూచుమల్ల లలిత, జ్యోత్స్న, విజయ, రొయ్య కిరణ్, ముడుసు బిక్షం, మునుకు పృథ్వీ, అద్దంకి వెంకన్న పాల్గొన్నారు.


ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా

● డీఎస్‌వో వెంకటేశ్వర్లు



నాగార్జునసాగర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

పేదల కోసం సమరశీల పోరాటాలు : వెంకట్‌రెడ్డి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదల ప్రజల కోసం సమర శీల పోరాటాలు చేస్తున్నామని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30న నిర్వహించే సీపీఐ వసంతోత్సవ వేడుకల మహాసభల పోస్టర్‌ని, బుధవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. అనేక త్యాగాలు, పోరాటాలతో నిర్మితమైనది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటైందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి దేశంలో కష్టజీవుల పక్షాన కార్మిక, రైతాంగ, మహిళా, విద్యార్థి, యువజన హక్కుల సాధనకోసం పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థిక అసమానతలులేని సమాజం నిర్మాణ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. డిసెంబరు 26 నాటికి 100వ ఏడాదిలోకి అడుగుపెడుతుందన్నారు. వేడుకలను పురస్కరించుకొని డిసెంబరు 30న జిల్లాకేంద్రంలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగసభకు 40వేల నుంచి 50వేల మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఖిల్లా అన్నారు. సీపీఐ బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుంచి వచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జమిలి ఎన్నిక మోదీ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బంటు వెంకటేశ్వర్లు, బొల్లుగి నర్సింహ, వెంకటేశ్వర్లు, గాదెపాక రమేష్, కేఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు వేదిక

నేడు, రేపు నల్లగొండలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రదర్శనలో 113 ప్రాజెక్టులు

నల్లగొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని డాన్‌బోస్కో హైస్కూల్‌లో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ప్రారంభం కానుంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నల్లగొండలో 19, 20 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలస్థాయిలో ఎంపికైన 113 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు పోటీ పడనున్నారు. సైన్స్ ప్రదర్శనతో పాటు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన కూడా నిర్వహించనున్నారు. విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించేలా, సైన్స్‌పై ఆసక్తిని పెంచేలా ప్రభుత్వం సైన్స్ ఎగ్జిబిషన్‌లను నిర్వహిస్తుంది. సైన్స్ టీచర్లు, గణితశాస్త్ర సహకారంతో విద్యార్థులు నూతన ఆలోచనలు పెంపొందించి ప్రజలకు అవసరమైన పరిశోధనలు తయారు చేసే విధంగా కృషి చేస్తుంది. ఇందుకోసం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్ర సాంకేతిక విషయాలపై ఆసక్తిని పెంపొందింపజేసి ప్రాజెక్టుల రూపకల్పన చేస్తున్నారు. విద్యార్థులకు వచ్చిన ఆలోచనలను తయారు చేసిన ప్రాజెక్టులను తోటి విద్యార్థులకు తెలియజేసే విధంగా ప్రదర్శనలో అవకాశం కల్పిస్తున్నారు.

ప్రధాన అంశాలు ఇలా.....

సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర అంశాలపై ఎగ్జిబిటర్లను ప్రదర్శించనున్నారు. ప్రధానంగా ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, సమాచార రంగం, వ్యవసాయం, సేంద్రియ పద్ధతులు, విపత్తుల నిర్వహ ణ, గణిత నమూనాలు, కాంపిటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే ఉప అంశాలపై నూతన ఆవిష్కరణలు ప్రదర్శించనున్నారు.

ఎంపికైన ప్రాజెక్టుల తయారీకి నిధుల మంజూరు

జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించేందుకు మండలస్థాయి నుంచి 113 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల తయారీ కోసం ప్రభుత్వం ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున మంజూరు చేసింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ ప్రదర్శనలు జరగనున్నాయి. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు జూనియర్, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. ఒక్కొక్క ప్రాజెక్టు వెంట ఒక విద్యార్థి, పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయుడిని అనుమతి ఇస్తారు. సైన్స్ ఫెయిర్‌లో భాగంగా 20వ తేదీన సాయంత్రం మిల్లెట్స్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్‌పై సెమినార్ నిర్వహించనున్నారు.

నల్లగొండకు వెళ్లాలంటే అవస్థలే

▸▸ నిడమనూరు నుంచి జిల్లా కేంద్రానికి నేరుగా బస్సులు కరువు ▸▸ ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



నిడమనూరులో బస్సు కోసం పరుగెడుతున్న ప్రయాణికులు

ప్రయాణికుల సంక్షేమమే మా లక్ష్యం అని ఆర్టీసీ అధికారులు చెబుతున్న మాటలు ఆచరణలో మాత్రం పాటించడం లేదు. నిడమనూరు నుంచి నల్లగొండకు, నల్లగొండ నుంచి నిడమనూరుకు నేరుగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. అలాగే నల్లగొండ నుంచి నిడమనూరు రావడానికి నేరుగా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఉంది. గతంలో అర గంటకు ఒక బస్సు ఉండేది. పైగా హాలియా, నాగార్జునసాగర్, మాచర్ల ప్రాంతాలకు వెళ్లే అన్ని బస్సులు నిడమనూరు మీదుగా వెళ్లేవి. దీంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. కానీ ప్రస్తుతం నిడమనూరు మీదుగా రాకుండా చెక్‌పోస్టు, హాలియా నుంచి బస్సులు వెళ్తుండటంతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నిడమనూరు)

నిడమనూరు నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు కనీసం ఒక్క మినీ బస్సు కూడా వేయలేదు. ఉదయం ఎనిమిదిన్నర గంటల సమయంలో మాత్రమే ఒక్క బస్సు నేరుగా నిడమనూరు నుంచి నల్లగొండకు వెళ్తోంది. నిత్యం అది వస్తుందో రాదో తెలియక ప్రయాణికులు సతమతమవుతున్నారు. దీంతో నల్లగొండ వెళ్లాలంటే బస్సుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. చేసేదేమీ లేక నిడమనూరు ప్రజలు నల్లగొండ వెళ్లేందుకు 14వ మైలు రాయి చెక్‌పోస్టు వద్దకు వెళ్లి బస్సులు ఎక్కుతున్నారు.. ఒక్కోసారి అక్కడ కూడా గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. రెండు బస్సులు మారాల్సి ఉండటంతో 35 కిలోమీటర్ల ప్రయాణానికి నల్లగొండ చేరేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుంది. పైగా ప్రయాణికులపై అదనపు భారం కూడా పడుతోంది. దీంతో డబ్బుతో పాటు సమయం కూడా వృథా అవుతున్నది. జిల్లా కేంద్రానికి నేరుగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారని జనం వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బస్సుల సమస్యలపై స్పందించడం లేదని నిడమనూరు ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. నిడమనూరు నుంచి నల్లగొండ వెళ్లేందుకు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఆర్టీసీ అధికారులు ఇక్కడ నుంచి జిల్లా కేంద్రానికి నేరుగా బస్సులు వేయాలని కోరుతున్నారు.

నేరుగా బస్సులు నడపాలి



నిడమనూరు నుంచి నల్లగొండ వెళ్లేందుకు నేరుగా బస్సులు లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు మారాల్సి ఉన్నందున జిల్లా కేంద్రం చేరేందుకు, అక్కడి నుంచి నిడమనూరు వచ్చేందుకు గంటల సమయం పడుతుంది. బస్సులు వేస్తామని ఆర్టీసీ అధికారులు గతంలో హామీ ఇచ్చినప్పటికీ బస్సులు మాత్రం వేయడం లేదు. వచ్చే ఒక్క బస్సు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా తక్షణమే నల్లగొండకు నేరుగా బస్సులు నడపాలి.

- గడ్డం శ్రీనివాస్, నిడమనూరు.

అద్దె బస్సుల ఒప్పందం ప్రకారం నడిపిస్తున్నాం

నల్లగొండ నుంచి హాలియా, మాచర్ల ప్రాంతాలకు అన్ని అద్దె బస్సులే తిరుగుతున్నాయి. ఒప్పందం ప్రకారమే అద్దె బస్సులు ఆ రూట్లో చెక్‌పోస్టు మీదుగా నడుస్తున్నాయి. అద్దె బస్సుల ఒప్పందం ఉంటుంది. ఒప్పందం పూర్తికాకుండా బస్సుల రూట్లు మధ్యలో మార్చడం కుదరదు. అద్దె బస్సుల ఒప్పందం పూర్తి కాగానే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనాథ్, డీఎం, నల్లగొండ

'దేవరకొండలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయాలి'

దేవరకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ మార్కెట్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్ పార్టీ పట్టణాధ్యక్షుడు గుండాల అంజయ్య యాదవ్, బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్‌కు నిధులు మంజూరైనప్పటికీ మున్సిపల్ అధికారులు స్థల సేకరణలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మార్కెట్ లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ప్రభుత్వం స్థలం కేటాయించి మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

నిడమనూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద కుటుంబాలకు వరమని మాజీ ఎంపీపీ, జిల్లా కాంగ్రెస్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి అన్నారు. మండలంలోని వడ్డెరగూడెం గ్రామానికి చెందిన గోగుల అంసితకు సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బుధవారం లబ్ధిదారుల ఆలయన కుటుంబాలకు అంద జేసి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, గోగుల ఎల్లేష్, గంగుల శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మా కుటుంబ ప్రతిష్టను దిగజార్చారు

● విలేకరుల సమావేశంలో రాయపూడి భవాని



విలేకరులతో మాట్లాడుతున్న భవాని కుటుంబ సభ్యులు

మిర్యాలగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దివంగత కాంగ్రెస్ నేత తిరునగరు గంగాధర్ కుమార్తెనైన తనపై ప్రభుత్వ భూ ఆక్రమణదారుగా చిత్రీకరించి కుటుంబ ప్రతిష్టను దిగజార్చారని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆరోపించారు. భర్త ఉమాశేఖర్, కుమారుడు వెంకటేశ్‌తో కలిసి బుధవారం తన ప్లాట్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే నంబర్ 711 లో 2012లో 22 గుంటలు కొనుగోలు చేసి 4 ఏళ్ల క్రితం దాని చుట్టూ తాత్కాలిక ప్రహరీ నిర్మించి గేటును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్, మున్సిపల్ అనుమతి పొందినట్లు చెప్పారు. కాగా 3 ఫీట్ల ప్రభుత్వ భూమిని ఆక్ర మించినట్లు చెబుతూ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు గోడ కూల్చి సుమారు రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం కలుగజేశారని అన్నారు. నా ప్లాట్‌కు దారి లేకుండా మూసివేశారని అన్నారు. తన ప్లాట్‌కు మార్గం చూపాలని, నా ప్లాట్‌కు ఆనుకుని పాతించిన ప్రభుత్వ భూ మి బోర్డును తొలగించాలని లేకుంటే నిరాహారదీక్ష చేస్తానని అన్నారు. దీనికి తహసీల్దారే బాధ్యత వహించాలని అన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : సీఐ

దేవరకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుం టామని దేవరకొండ సీఐ నర్సింహులు హెచ్చరించారు. దేవరకొండలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని తాటికోల్, ముదిగొండ, మైనంపల్లి వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు దాడులు చేస్తున్నామన్నారు. పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించి నిఘా ఏర్పాటు చేశామని, అక్రమ ఇసుక రవాణాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్వాల గ్రామపంచాయతీలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. అనంతరం గ్రామ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్ర మంలో సామాజిక వేత్త రాంరెడ్డి, మాజీ సర్పంచ్ పెంకీస్ పాపిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చిట్టిపు రామనర్సమ్మ, రాఘవరెడ్డి, తిరుమలగిరి మత్స్య కార్మిక సహకార సంఘం చైర్మన్ పిట్టల కృష్ణ, నాంపల్లి సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఘాట్‌పై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదని టీడీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. మిర్యాలగూడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు ప్రజల అభిమాన నాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన చొరవతోనే సాధారణ ప్రజలకు రాజకీయ గుర్తింపు వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో టీడీపీ మద్దతు కోరిన రాజగోపాల్‌రెడ్డి నేడు ఎన్టీఆర్ ఘాట్‌ను తొలగించాలనడం సరికాదన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి

దామరచర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న తలపెట్టిన గ్రామపంచాయతీ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్న కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్ట్‌లు చేశారని, దానికి నిరసనగా ఈనెల 18, 19న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, ఎండీ.జహీరొద్దిన్, సైదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డు మాయం

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమి సూచిక బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా రెవెన్యూ ధికారుల పరిశీలనలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతంలోని 60, 61 సర్వే ంబర్లలో ఎకరం 18గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. గతంలో ఓ చిన్నకారు రైతు ఈ స్థలాన్ని చదును చేసి మల్లెతోట వేసుకున్నాడు. మిర్యాలగూడ చిన్నచెర్వు పరిధిలోని ఈ భూమిని జీవనోపాధి కింద చిన్నకారు రైతు విని యోగించుకోవడంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు సైతం అంతగా పట్టించుకోలేదు. తాళ్లగడ్డలో ఇందిరమ్మకాలనీ ఏర్పాటు కావడం, అక్కడి భూములకు ధరలు పెరిగిన నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకులు తమ పలుకుబడితో సదరు మల్లెతోటను పక్కనే ఉన్న పట్టా భూమిలో కలిపి వెంచర్ చేశారు. దీన్ని గమనించిన రెవెన్యూ అధికారులు గతంలో హద్దులు నిర్ణయించి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డును గుర్తుతెలియని వ్యకులు తొలగించారు. దీన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ విచారణ నిమిత్తం తహసీల్దార్ హరిబాబుకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నిందితుల వివరాలు తెలియకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్‌తోపాటు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ హెచ్చరించారు. త్వరలోనే బోర్డును తొలగించిన నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

'రైతు భరోసా' నిధులు ఒకేసారి విడుదల చేయాలి



సబ్‌కలెక్టర్‌అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

మిర్యాలగూడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి పంట కాలాలకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఒకేసారి విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరి ఏడాది గడిచినా 40 శాతం మంది రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి రూ 15వేలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే రెండు పంటలకు కలిపి ఒకే సారి రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, మల్లు గౌతంరెడ్డి, గోవిందరెడ్డి, కోట్ల శ్రీనివాసరెడ్డి, గోలి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబానికి జానారెడ్డి పరామర్శ



శాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జానారెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు శాగం పెద్దిరెడ్డి మాతృమూర్తి శాంతమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి బుధవారం తిరు మలగిరికి చేరుకొని శాంతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ యాదవ్, శాగం మంగమ్మ, నాగెండ్ల కృష్ణారెడ్డి, శాగం రాఘవరెడ్డి, రిక్కల కొండారెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, శాగం నాగిరెడ్డి, గాలి శ్యాంసుందర్‌రెడ్డి, అనుమలు అంజి, నాగెండ్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పాఠశాల ఎదుట ధర్నా చేసి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మెబాట పట్టడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారు కరువయ్యారని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కొరె రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షాఉద్యోగులు ఈనెల 6 నుంచి సమ్మె చేస్తుండగా ఇందులో భాగంగా కేజీబీవీలో బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది సమ్మెలో పాల్గొన డంతో విద్యార్థులకు తరగతులు నిర్వహించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా విద్యార్థులకు పాఠాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివాని, మహేశ్వరి, శశిత, విద్యార్థులు పాల్గొన్నారు.


దామరచర్లలో మూతపడిన ఎమ్మార్పీ భవనం



దామరచర్లలో మూతపడిన ఎమ్మార్పీ భవనం

దామరచర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టడంతో ఎమ్మార్పీ భవనానికి తాళాలు వేయడంతో మూత పడింది. దీంతో రోజువారి కార్యక్రమాలు నిలిచిపోయాయి. మండలం నుంచి విద్యార్థులు వివరాలు, టీచర్ల హాజరు వివరాలు జిల్లాకు నిలిచిపోగా కేజీబీవీ విద్యాల యాల్లో విద్యార్థినులకు బోధన నిలిచిపోయింది. కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, సీఆర్పీలు, సీసీవో, ఎంఎస్ కోఆర్డినేటర్, పీటీఐ, ఐఆర్పీలు, మెసెంజర్లు సమ్మెలో ఉన్నారు.

సీఎం కప్ ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక



ఫయాజ్ మాలిక్

గుర్రంపోడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ సీనియర్ ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం మైనార్టీ కళాశాల విద్యార్థి ఫయాజ్ మాలిక్ ఎంపికయ్యారు. నల్లగొండ పట్టణం లోని మేకల అభినవ్ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మహ్మద్ ఫారుఖ్, పీఈటీ శ్రీను తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని అధ్యపకులు వేణుగోపాల్, రామకృష్ణ, గోవర్ధన్, వెంకన్న, అతియా అంజూం, శ్రీలత, సమీనాసుల్తానాలు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు

(5వపేజీ తరువాయి)

లోనే ఆధునిక టెక్నాలజీగల రైస్ మిల్లులుండడంతో ఇక్కడ మిల్లర్ల కొనుగోళ్ల తాకిడికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం రాని పరిస్థితి సీజన్ ఆసాంతం కొనసాగింది. ప్రధానంగా మిర్యాలగూడ కేంద్రంగా ఉన్న రైస్‌మిల్లుల్లో సీజన్ మొదట్లో కొంత తక్కువ ధర ఇచ్చిన మిల్లర్లు, ఆ తర్వాత ధాన్యం తగ్గిపోవడంతో ధరను పెంచేశారు. ధాన్యం తేమశాతం పట్టించుకోకుండా క్వింటాకు కనీసం రూ.2200నుంచి ఇటీవల క్వింటాకు రూ.2800వరకు ఇచ్చారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అయితే 17శాతానికి మించి తేమ ఉంటే కొనడంలేదు. ఈ కారణంతో పాటు, ధాన్యం ఆరబెట్టుకుంటే వారంపాటు వచ్చే ఖర్చులను పరిగణనలోకి తీసుకొన్న రైతాంగం సన్నరకం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు విక్రయించేశారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 37,435 మెట్రిక్ టన్నుల సన్నధాన్యమే కొనుగోలు చేస్తే, అదే మిల్లర్లు ఇప్పటికే 6,03,450 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తంగా సన్నధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల హవానే కొనసాగింది.

శరణుఘోషతో మార్మోగిన మణికంఠ ఆలయం



మణికంఠ ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

చింతపల్లి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ ఎదురుగా నెలకొల్పిన మణికంఠ ఆలయంలో భక్తులు బుధవారం మహాపడి పూజ నిర్వహించారు. గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి, ధర్మశాస్త్ర అయ్యప్పకు పంచ మృతాభిషేకం, కామేశ్వరి దేవికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు. మహాపడి పూజకు రంగారెడ్డి, నల్లగొండ, జిల్లాలకు చెందిన ప్రజలు ప్రాం గణానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పట్టణ పురవీధుల్లో రథోత్సవ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు, పట్టణంలో అయ్యప్ప శరణు ఘోష నామస్మరణతో మార్మోగింది. భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి కన్వీనర్ కనిగిరి గోవర్దన్, గురుస్వాములు వైద్యుల ప్రవీణ్ శర్మ, మల్లోజు జగదీశ్వరాచారి, మట్ట యాదయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్ కుమార్, గొడుకొండ్ల మాజీ సర్పంచ్ కొండూరి శ్రీదేవీశ్రీనివాస్, రఘుపతి రాజు, గణేష్, కిరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డాక్టర్స్‌కాలనీలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● పర్యవేక్షించిన డీఎస్పీ



సెల్లార్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలోలో 'అంబులెన్స్‌కు దారేదీ..?' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో డీఎస్పీ స్పందించి పోలీసులు కాలనీ వీధులను పరిశీలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరు, స్థానికంగా నెలకొన్న వాస్తవ పరిస్థితులను డీఎస్పీ రాజశేఖర్‌రాజు క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా పలు ఆసుపత్రులకు సం బంధించిన సెల్లార్లను ఇతర అవసరాల కోసం వినియోగిస్తున్నట్లు గమనించారు. డాక్టర్స్ కాలనీ రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలను అంత రాయం కలిగించే విధంగా ఆస్పత్రుల సూచిక బోర్డులను గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో ట్రాఫిక్ సమస్యను ఉత్పన్నం చేసే విధంగా ఆస్పత్రి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్లుగా క్షేత్రస్థాయి పరిశీలనలో గమనించామ న్నారు. సమస్యను పరిష్కార మయ్యేంత వరకు డ్రైవ్ కొనసాగుతుంద న్నారు. ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమైన సెల్లార్ల వినియోగాన్ని తొలగించాలని ఆస్పత్రుల నిర్వాహకులను ఆదేశించారు. సూచనలు పాటించని ఆస్ప త్రులపై శాఖ పరమైన చర్యలు తీసు కుంటా మని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట టూటౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్‌బాబు సిబ్బంది ఉన్నారు.

పనిచేయని పట్టాదారు పాస్‌పుస్తకం ప్రింటర్

డిండి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూమి పట్టాదార్ పాస్‌పుస్తకం ప్రింటర్ సంవత్సరంపైగా పనిచేయడం లేదు. రైతులు పాస్‌పుస్తకంలో తమ భూమి వివరాలను నమోదు చేసుకునేందుకు 40 కిలోమీటర్ల దూరంలోని దేవరకొండకు వెళ్తున్నారు. ప్రింటింగ్ మిషన్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రింటర్ చెడిపోవడంతో మరమ్మతుల కోసం నల్లగొండకు పంపించినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

దేవరకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేవరకొండ లయన్స్‌క్లబ్ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయ మని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిప్పర్తి రుక్మారెడ్డి అన్నారు. దేవరకొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద కుటుంబానికి చెందిన వారికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించడంతో పాటు పేదలకు సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, కార్యదర్శి ప్రభాకర్, గాజుల రాజేష్, ఉషరాణి, చీదెళ్ల వెంకటేశ్వర్లు, నీల బుచ్చయ్య, జంగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.